ప్రజాశక్తి
సోమవారం 23 జూన్ 2025 8 పేజీలు

గుంటూరు

పల్నాడు

నిర్లక్ష్యంతో నిండు ప్రాణాలు బలి

- విఐపి పర్యటనలపై తరచూ వివాదాలు
- దూసుకొస్తున్న యువకులను అదుపు చేయడం లేదని ఆరోపణలు
- పరస్పర విమర్శలతో కాలం వెళ్లబుచ్చుతున్న పోలీసులు, ప్రధాన పార్టీలు

ప్రజాశక్తి-గుంటూరు జిల్లాప్రతినిధి

జిల్లాలో విఐపి పర్యటనలపై తరచూ వివాదాలు చోటుచేసుకుంటున్నాయి. అధికార యంత్రాంగం కనీస బందోబస్తు కల్పించకపోవడం వల్ల ఇలాంటి అవాంఛనీయ ఘటనలు జరుగుతున్నాయి. అంతా సాఫీగా జరిగితే తమ పర్యటన గొప్పగా జరిగిందని లేదంటే పోలీసుల వైఫల్యం ప్రధాన రాజకీయ పార్టీలు ఆరోపణలు చేయడం పరిపాటిగా మారింది. పోలీసులు మొక్కుబడిగా కేసులు నమోదు చేయడం, ఆ తరువాత సంబంధిత ఘటనపై ఏమాత్రం పట్టించుకోకపోవడంతో ఇవ్వన్నీ మామూలే అన్న ధోరణి రాజకీయ పార్టీల్లో వ్యక్తం అవుతోంది. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు కేసులు నమోదు అయినా అధికారంలోకి వచ్చిన తరువాత మ్యానేజ్ చేసుకోవచ్చునన్న భావనలో రెండు పార్టీలు ఉంటున్నాయి.

ఇదే కోవలో మాజీ సిఎం జగన్ ఈనెల 18న జరిగిన రెంటపాళ్ల పర్యటన వివాదంగా మారింది. జెడ్ కేటగిరిలో ఉన్న మాజీ సిఎం జగన్‌కు తగిన బందోబస్తు కల్పించడంలో చాలా కాలంగా పోలీసుల నిర్లక్ష్యం స్పష్టంగా కనిపిస్తోంది. ప్రజలు ఆయన మీదకు చొచ్చుకుని వస్తున్నా చూసిచూడనట్టు వ్యవహరిస్తున్నారు. జగన్ రెంటపాళ్ల పర్యటనపై పోలీసులు అనేక ఆంక్షలు ప్రకటించారు. కానీ క్షేత్ర స్థాయిలో ఎక్కడా ఆంక్షలు అమలు చేయలేదు. జగన్ కాన్వాయ్‌లో మొత్తం 14 వాహనాలకు అనుమతి ఇచ్చామని, పార్టీ జిల్లా నాయకులకు మరో మూడు వాహనాలకు మాత్రమే అనుమతి ఇచ్చినట్టు జిల్లా ఎస్‌పి సతీష్‌కుమార్ ప్రకటించారు. అయితే జగన్ తాడేపల్లి నుంచి 50 వాహనాల్లో రెంటపాళ్లకు బయలుదేరినా ఎక్కడా నియంత్రించలేదు. జగన్ దాదాపు 7 గంటల పాటు ర్యాలీ నిర్వహించారు. గుంటూరు నుంచి రెంటాపాళ్లకు గంటన్నరలో వెళ్లే అవకాశం ఉన్నా ఏడు గంటలపాటు ర్యాలీ నిర్వహించడం, కార్యకర్తలతో మమేకం కావడం ద్వారా ర్యాలీ విజయవంతంగా జరిగిందని వైసిపి నాయకులు సంబరబడ్డారు. అయితే ర్యాలీలో గుంటూరుకు సమీపంలోని ఏటుకూరు వద్ద జగన్ కారు కింద ఒక కార్యకర్త పడి మృతికి కారణం కావడం వివాదస్పదంగా మారింది.

ఇటీవల జగన్ పర్యటన సందర్భంగా ఏటుకూరు వద్ద జగన్ కాన్వాయ్ కింద పడిన సింగయ్య

జగన్ కార్యకర్తలకు అభివాదం చేస్తున్న కారు కింద వెంగళాయపాలెంకు చెందిన వైసిపి కార్యకర్త చీలి సింగయ్య పడినా డ్రైవర్ , వైసిపి నాయకులు, ఇతరనాయకులు ఎవ్వరూ పట్టించుకోలేదు. జగన్‌కు భద్రత కల్పించాల్సిన పోలీసు అధికారులు నిర్లక్ష్యం కూడా సింగయ్య మృతికి పరోక్షంగా కారణంగా నిలుస్తోంది. కారు చుట్టూ ఉండాల్సిన రోప్ పార్టీ లేదని వైసిపి నాయకులు కొత్త వాదనను తెరపైకి తెచ్చారు. జగన్ ర్యాలీ ▶ 2లో

నేడు 'సుపరిపాలనలో - తొలి అడుగు సమావేశం'

పూర్తయిన ఏర్పాట్లు - జిల్లాలు, నియోజకవర్గాల వారీగా చర్చల కోసం రౌండ్ టేబుళ్లు - 2లో

లచ్చన్నగుడిపుడి గ్రామ సభలో సందేహాలను ప్రస్తావిస్తున్న రైతు

సమస్యలను పరిష్కరిస్తేనే భూములు

- ప్లాట్లు, కౌలు, అప్పులపై ప్రశ్నించిన రైతులు
- వారం రోజుల్లో స్పష్టతొస్తుందన్న ఎమ్మెల్యే
- రాజధానికి భూ సమీకరణ కోసం మూడు గ్రామాల్లో సభలు

ప్రజాశక్తి - తాడికొండ

తమ సమస్యలను పరిష్కరిస్తేనే పూలింగ్‌కు భూములిస్తామని రైతులు స్పష్టం చేశారు. రాజధానికి భూసమీకరణ కోసం మండలంలోని మోతడక, లచ్చన్నగుడిపూడి, ముక్కామల గ్రామాల్లో ఆదివారం గ్రామ సభలు నిర్వహించారు. ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్ కుమార్, ఆర్‌డిఒ శ్రీనివాసరావు ఎదుట రైతులు తమ సమస్యలను, అభిప్రాయాలను చెప్పారు. భూసమీకరణలో తమ భూములిస్తే రిటర్నబుల్ ప్లాట్లు ఎక్కడ ఇస్తారని అడిగారు. మోతడక వద్ద ప్లాట్లు కేటాయించాలని లచ్చన్నగుడిపూడి, ముక్కామల గ్రామస్తులు కోరారు. కౌలు పరిహారం ఎకరాకు రూ.40 వేలు చెల్లించాలని డిమాండ్ చేశారు. తమ పిల్లల చదువుల కోసం పొలాలను తాకట్టు పెట్టి అప్పులు చేశామని, పొలాలపై పంట రుణాలను తీసుకున్నామని, ఇప్పుడు ఆ భూములను పూలింగ్‌లో ఇస్తే అప్పులెలా తీర్చుకోవాలని చిన్న, సన్నకారు రైతులు పశ్నించారు. రెవెన్యూకు సంబంధించి అనేక సమస్యలున్నాయని, వాటిని పరిష్కరించకుండా భూ సమీకరణకు ఎలా వెళతారని నిలదీశారు. తనకు రూ.50 లక్షలు అప్పు ఉందని, తన తమ్ముడికి రూ.కోటిఅప్పు ఉందని, తమ సమస్యలను ఎవరు పరిష్కరిస్తారని ముక్కామల గ్రామానికి చెందిన దానబోయిన శ్రీనివాసరావు అడిగారు. భూ సమీకరణ ప్రకటన రావడంతో భూములు కొనుగోలు చేయడానికి వ్యాపారులు ఎవరు ముందుకు రావడం లేదని, తాము అప్పుల నుండి ఎలా బయటపడతామని శ్రీనివాసరావు వాపోయారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ రాజధాని పరిసర ప్రాంతాల్లోకి జాతీయ, అంతర్జాతీయ సంస్థలు వస్తున్నాయని తెలిపారు. ఇప్పటికే 133 సంస్థలకు భూములిచ్చామని, కొన్నిచోట్ల పనులు ప్రారంభం అయ్యాయని, మరికొన్నిచోట్ల పనులు ప్రారంభం కావాల్సి ఉందని చెప్పారు. అంతర్జాతీయ సంస్థలు వస్తున్న నేపథ్యంలో ▶ 2లో

అసైన్డ్ భూమిలో అక్రమ లేఅవుట్లు!

ప్రజాశక్తి- తాడేపల్లి

అసైన్డ్ భూమిలో అక్రమ లేఅవుట్లు తాడేపల్లి ప్రాంతంలో ఇబ్బడి ముబ్బడిగా వెలుస్తున్నాయి. క్రయవిక్రయాలతో రూ.లక్షలు చేతులు మారుతున్నాయి. రాజధాని ముఖద్వారమైన ఉండవల్లి ఎస్సీ కాలనీ నుండి తాడేపల్లి తహశీల్దార్ కార్యాలయం వచ్చే దారిలో రోడ్డు పక్కన ఉన్న అసైన్డ్ భూమిలో సెంటు రూ.నాలుగు లక్షల చొప్పున అమ్ముతున్నారు. మీరేమీ

మాయమాటల్తో జోరుగా క్రయవిక్రయాలు

భయపడవద్దు.. ఏదైనా అయితే అంతా మేమే చూసుకుంటాం.. అధికారంలో ఉంది మేమే కాబట్టి మీకు ఏమి ఇబ్బంది ఉండదు.. అని కొంతమంది చోటామోటా నాయకులు గుట్టుచప్పుడు కాకుండా స్థలాలు అమ్ముకుంటున్నారు. రిజిస్ట్రేషన్ చేయాలని కొనుగోలుదారులు అడిగితే స్వాధీనం ▶ 2లో

బస్సుల్లో పిల్లలు భద్రమేనా?

- పలు విద్యాసంస్థల వాహనాలకు ఇంకా పూర్తవ్వని ఫిట్‌నెస్ టెస్ట్
- పాతబస్సులు తక్కువ ధరకు కొని.. మెరుగులద్ది నిర్వహణ
- పరిమితికి మించి విద్యార్థుల తరలింపు - నిబంధనలు పాటించని యాజమాన్యాలు

ప్రజాశక్తి-పిడుగురాళ్ల

వేసవి సెలవుల అనంతరం పాఠశాలల పున:ప్రారంభం నేపథ్యంలో కార్పొరేట్, ప్రైవేటు విద్యాసంస్థలను విద్యార్థులను తరలించే బస్సులు సురక్షితమేనా అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి. దాదాపు 10 నుండి 30 కిలోమీటర్ల దూరంలోని విద్యాసంస్థలకు పిల్లల్ని తీసుకుని బస్సులు ప్రయాణిస్తుంటాయి. ఆయా బస్సుల ఫిట్‌నెస్‌ను పూర్తి స్థాయిలో తనిఖీ చేశారా? డ్రైవర్లు అనుభవజ్ఞులేనా? అనే ఆందోళనలు ఒకవైపైతే విద్యార్థులను పరిమితికి మించి ఎక్కించడమూ విమర్శలకు తావిస్తోంది.

బస్సులో సీట్లు నిండిపోవడంతో నిల్చుని ప్రయాణిస్తున్న విద్యార్థులు

తల్లిదండ్రులు గతంలో ఆటోల్లో తమ పిల్లల్ని పాఠశాలలకు పంపించే వారు. అయితే వారు పరిమితికి మించి ఎక్కిస్తుండడం, ▶ 2లో

అసైన్డ్ భూమిలో అక్రమ లేఅవుట్లు!

(మొదటి పేజీ తరువాయి)

అగ్రిమెంట్ రాసిస్తామని, అదే అన్నిటికీ సరిపోతుందని చెబుతున్నారు. ఈ మాటలు నమ్మి ఇప్పటికే కొంతమంది ప్లాట్లు కొనుగోలు చేసినట్టు సమాచారం.

ఇదిలా ఉండగా అసైన్డ్ భూములను రిజిస్ట్రేషన్ భూములంటూ నమ్మించడానికి ఆ స్థలంలో ఒక షెడ్డు వేసి, విద్యుత్ సరఫరా కూడా వచ్చిందంటూ బుట్టలో వేసుకుంటున్నారు. ఇటీవల కొంతమందికి మంత్రి నారా లోకేష్ ఇళ్ల పట్టాలు పంపిణీ చేయడాన్ని కూడా తమకు అనుకూలంగా మలుచుకుని, తాము అమ్మ బోయే స్థలాలకు కూడా త్వరలోనే పట్టాలొస్తాయని చెబుతున్నారు. ఎవరైనా గట్టిగా అడిగితే తమ లేఅవుట్లకు డీకే పట్టాలున్నాయని చెబుతున్నారు. రాజధాని ప్రాంతం కావడంతో భవిష్యత్తులో స్థలాలు దొరకవేమోనన్న ఉద్దేశంతో కొందరు కొంటున్నారు. ఈ నేపథ్యంలో అధికారులు జోక్యం చేసుకుని అక్రమ లే అవుట్లపై చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

సమస్యలను పరిష్కరిస్తేనే భూములు

(మొదటి పేజీ తరువాయి)

అంతర్జాతీయ విమానాశ్రయం సైతం మన పరిసరాల్లో వచ్చే అవకాశం ఉందన్నారు. రైతుల సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. ఏ గ్రామాన్ని కూడా తొలగించబోమని హామీ ఇచ్చారు. మరో వారం రోజుల్లో భూ సమీకరణపై స్పష్టతిస్తామన్నారు. కౌలురైతులను, వ్యవసాయ కూలీల కుటుంబాలు నష్టపోకుండా ప్రభుత్వం తగిన న్యాయం చేస్తుందని చెప్పారు. కార్యక్రమంలో తహసీల్దార్ మెహర్ కుమార్, రెవెన్యూ సిబ్బంది, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

నిర్లక్ష్యంతో నిండు ప్రాణాలు బలి

(మొదటి పేజీ తరువాయి)

గొప్పగా జరిగిందని చెప్పుకున్న నేతలు కార్యకర్త సింగయ్య జగన్ కారు కింద పడిన వీడియో బయటకు వచ్చిన తరువాత నెపం మొత్తాన్ని పోలీసులకు నెట్టే ప్రయత్నం చేశారు. పోలీసులు మాత్రం మా నిబంధనలకు వ్యతిరేకంగా ర్యాలీ జరిగిందని కేసులు నమోదు చేశారు. ఇలా ఒకరిపై మరొకరు విమర్శలు చేసుకున్నా సింగయ్య మృతి విషయంలో నిర్లక్ష్యం రెండు వైపులా కన్పిస్తుంది. పోలీసులు బందోబస్తులో నిర్లక్ష్యంగా వ్యవహరించడం, ర్యాలీలో కార్యకర్తల హల్‌చల్‌ను నిరోధించకుండా ఆనందించి కారు కింద మనిషి పడినా పట్టించుకోకుండా వెళ్లిపోవడం వైసిపి నాయకుల నిర్లక్షాన్ని బహిర్గతం చేసింది. జగన్ జిల్లాకు ఎప్పుడు వచ్చినా అధికారులు బందోబస్తు విషయంలో చాలా తగిన శ్రద్ధ చూపడం లేదని ఎందుకు ప్రభుత్వం నుంచి వత్తిడిలే కారణమని వైసిపి నాయకులు ఆరోపిస్తున్నారు. పర్యటనల్లో వివాదం ఏర్పడితే జగన్ పర్యటనలు తగ్గుతాయన్న భావన ప్రభుత్వ పెద్దల్లో కన్పిస్తుంది. ఈ వివాదాల నేపథ్యంలో సామాన్య ప్రజల ప్రాణాలు గాల్లో కలిసి పోతున్నాయి.

వైసిపి హయాంలోనూ ఇంతే...

సిఎం చంద్రబాబు ప్రతిపక్ష నేతగా 2019 నుంచి 2024 వరకు జిల్లాలో పర్యటనకు వచ్చినప్పుడు కూడా తగిన బందోబస్తు కల్పించలేదని టిడిపి నాయకులు గుర్తు చేస్తున్నారు. 2023లో గుంటూరు జెకెసి కళాశాల రోడ్డులో అప్పట్లో టిడిపి నాయకులు ఏర్పాటు చేసిన చీరల పంపిణీలో తొక్కిసలాట జరిగి ముగ్గురు మహిళలు మృతి చెందారు. అయితే ఇందుకు సంబంధించి నమోదు చేసిన కేసులో అప్పటి ప్రధాన నిందితుడు ఉయ్యూరు శ్రీనివాసరావుకు కోర్టు వెంటనే బెయిల్ మంజూరు చేసింది. మృతులు కుటుంబాలకు ఆర్థిక సాయం చేసి టిటిపి నాయకులు చేతులు దులుపుకున్నారు. అప్పట్లో పోలీసులు తగిన భద్రత కల్పించలేదని టిడిపి నాయకులు ఆరోపించగా టిడిపి నాయకులు తగిన జాగ్రత్తలు, సమయపాలన పాటించలేదని పోలీసులు వాదించారు. మొత్తంగా ముగ్గురు సామాన్య మహిళలు మృతి చెందిన ఘటన అప్పట్లో సంచలనం కలిగించింది.

నేడు 'సుపరిపాలనలో - తొలి అడుగు సమావేశం'

ప్రజాశక్తి - తుళ్లూరు

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది పూర్తయిన సందర్భంగా ప్రభుత్వం చేసిన అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరించేందుకు 'సుపరిపాలనలో - తొలిఅడుగు' పేరిట రాష్ట్ర సచివాలయం వెనుక వైపు సోమవారం సమావేశం జరగనుంది. సిఎం చంద్రబాబు, డిప్యూటీ సిఎం పవన్ కల్యాణ్‌తోపాటు రాష్ట్ర మంత్రులు, వివిధ శాఖల కార్యదర్శులు, శాఖాధిపతులు, జిల్లా కలెక్టర్లు, ఎస్పీలు హాజరుకానున్నారు. ఈ సమావేశంలో ప్రధానంగా ఏడాది కాలంలో సాధించిన అభివృద్ధితోపాటు భవిష్యత్ కార్యాచరణపై చర్చించనున్నారు. ఇందుకు సంబంధించిన ఏర్పాట్లు దాదాపు పూర్తయ్యాయి. ఏర్పాట్లను రాష్ట్ర మున్సిపల్ పరిపాలన శాఖ ముఖ్య కార్యదర్శి ఎస్.సురేశ్ కుమార్, గుంటూరు జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి ఆదివారం

పూర్తయిన ఏర్పాట్లు - జిల్లాలు, నియోజకవర్గాల వారీగా చర్చల కోసం రౌండ్ టేబుల్లు

ఏర్పాట్లను పరిశీలిస్తున్న ముఖ్య కార్యదర్శి సురేష్ కుమార్ కలెక్టర్ నాగలక్ష్మి తదితరులు

పరిశీలించారు. ప్రధాన వేదిక, సమావేశ ప్రాంగణంలో సీటింగ్ ఏర్పాట్లు, లైటింగ్, పార్కింగ్ తదితర ఏర్పాట్లను వారు పరిశీలించారు. సమావేశ ప్రాంగణంలో ప్రత్యేకంగా రౌండ్ టేబుళ్లను ఏర్పాటు చేశారు. ఈ టేబుళ్ళ వద్ద జిల్లాల వారీగా ఆయా అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలోని ప్రజాప్రతినిధులు, అధికారులు కలిసి కూర్చుని నియోజకవర్గాల్లో ఏడాది కాలంలో జరిగిన అభివృద్ధి, భవిష్యత్‌లో చేపట్టబోయే అభివృద్ధి, సంక్షేమ పథకాల ప్రణాళికలపై చర్చిస్తారు. పరిశీలనలో జెసి భార్గవ్‌తేజ్, రాష్ట్ర ప్రణాళికా శాఖ సంయుక్త కార్యదర్శి అనంత శంకర్, గుంటూరు ఆర్‌డిఒ శ్రీనివాసరావు, ప్రోటోకాల్ అదనపు డైరెక్టర్ మోహన్‌రావు, సిఆర్‌డిఎ ఎస్ఇ ధనుంజయ్, గుంటూరు డిఎఫ్ఒ శ్రీనివాసరెడ్డి, ఇతర విభాగాల అధికారులు పాల్గొన్నారు.

ఉద్యమాల ఆవశ్యకత పెరిగింది

ప్రజాశక్తి-గుంటూరు

ప్రస్తుత పరిస్థితి దృష్ట్యా ఉద్యమాల ఆవశ్యకత ఇప్పుడు ఎక్కువగా ఉందని పూర్వ విప్లవ విద్యార్థి వేదిక రాష్ట్ర కన్వీనర్ భరద్వాజ అన్నారు. ఆదివారం స్థానిక ఎన్‌జిఒ హోమ్‌లో 50 ఏళ్ల విప్లవ విద్యార్థి ఉద్యమ ప్రస్థానం సదస్సు నిర్వహించారు. సభకు నవజ్యోతి అధ్యక్షత వహించగా భరద్వాజ మాట్లాడుతూ గతంలో అనేక సాయుధ సంస్థలతో చర్చలు జరిపిన చరిత్ర ప్రభుత్వాలకు ఉందన్నారు. నేడు మావోయిస్టులు శాంతి చర్చలకు ముందుకు వచ్చినా కేంద్రం వారిని అంతం చేయడమే లక్ష్యంగా పెట్టుకుందన్నారు. అందుకే మావోయిస్టులతో చర్చలు జరపబోమని చెబుతూ ఒంటికాలితో దూకుతోందన్నారు. ఒకప్పుడు చర్చలు జరిపి ఇప్పుడు కాదని చెప్పటానికి కార్పొరేట్ సంస్థల నుంచి వస్తున్న వత్తిడే కారణమన్నారు. వీక్షణం పత్రిక సంపాదకులు వేణుగోపాల్ మాట్లాడుతూ ఇప్పటికీ రాడికల్స్ ప్రజల గుండెల్లో పదిలంగా ఉన్నారని, ఎందరో త్యాగమూర్తులు అమరులయ్యారని, వారిని స్ఫూర్తిగా తీసుకుని పూర్వ విద్యార్థి నాయకులుగా కర్తవ్యాన్ని నిర్దేశించుకోవాలని

సమావేశంలో మాట్లాడుతున్న భరద్వాజ

చెప్పారు. విరసం నాయకులు సి.ఎస్.ఆర్ ప్రసాద్ మాట్లాడుతూ ఉద్యమంలో ఒడిదుడుకులు వస్తుంటాయని, అంతమాత్రాన అది ముగిసిపోయినట్లు కాదని, ఉద్యమ వారసత్వ పరంపర కొనసాగుతూనే ఉంటుందని అన్నారు. పౌర హక్కుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు చిలుకా చంద్రశేఖర్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ఖనిజ సంపదను కార్పొరేట్లకు కట్టబెట్టడం కోసం ప్రజలపై యుద్ధం చేస్తోందని, ఆ ప్రజలకు మద్దతుగా నిలిచిన మావోయిస్టులను, వారితో పాటు అమాయక గిరిజనులను హత్య చేస్తోందన్నారు. సభలో దేశభక్త ప్రజాతంత్ర ఉద్యమం నాయకులు వెంకటేశ్వరరావు, డాక్టర్ అలా వెంకటేశ్వర్లు, విరసం రాష్ట్ర కార్యదర్శి రివేరా కార్యవర్గ సభ్యుడు పాణి, పలు ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు.

పేదలకు నిత్యావసరాలు పంపిణీ

ప్రజాశక్తి - పెదకాకాని

పేద విద్యార్థి చదువు, ఉపాధి కోసం 'లుక్ కల్చరల్ మీడియా' కృషి చేస్తుందని విజయవాడ టీం అధ్యక్షులు డాక్టర్ డి.రాజశేఖర్ అన్నారు. మండలంలోని వెనిగండ్ల గ్రామంలోని ఎస్టీల్లో ఎంపిక చేసినవారికి ఆదివారం నిర్వహించిన కార్యక్రమంలో నిత్యావసర సరుకులైన బియ్యం, నూనె, గోధుమపిండి అందజేశారు. విద్యార్థులకు అవసరమైన పుస్తకాలనూ అందిస్తామని చెప్పారు. 2021లో అమెరికాలో ప్రారంభమైన సంస్థ పలుదేశాల్లో సేవలు అందిస్తోందని, 30 లక్షల మందికి ఉపాధి అవకాశాలు కల్పించిందని అన్నారు. కార్యక్రమంలో డాక్టర్ కె.సుధీర్ కుమార్, డాక్టర్ కె.మధుబాబు, డాక్టర్ నాయక్, డాక్టర్ ఎంవి.రావు, అనిల్‌కుమార్ పాల్గొన్నారు.

ఘనంగా మూల్పూరి నరేష్ పుట్టినరోజు వేడుకలు

ప్రజాశక్తి - తుళ్లూరు : తెలుగు యువత మండల అధ్యక్షులు మూల్పూరి నరేష్ పుట్టినరోజు వేడుకలు సోమవారం తుళ్లూరులో ఘనంగా నిర్వహించారు. టిడిపి, తెలుగు యువత నాయకులు, కార్యకర్తలు, అభిమానులు నరేష్‌కు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. బాణసంచా కాల్చారు. గ్రామాల్లో ఫ్లెక్సీలు ఏర్పాటు చేసి అభిమానాన్ని చాటుకున్నారు. అభిమానులు ఏర్పాటు చేసిన భారీ కేక్‌ను నరేష్ కేక్ కట్ చేసి మిఠాయిలు పంచారు.

25న జిల్లా కాంగ్రెస్ సమావేశానికి షర్మిల

ప్రజాశక్తి - ప్రత్తిపాడు : కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల సమావేశం గుంటూరులోని జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో 25న సాయంత్రం 3 గంటలకు జరిగే సమావేశానికి పార్టీ రాష్ట్ర అధ్యక్షులు షర్మిల హాజరవుతారని, నియోజకవర్గ పరిధిలో శ్రేణులు తరలిరావాలని కాంగ్రెస్ పార్టీ ప్రత్తిపాడు నియోజకవర్గ కో-ఆర్డినేటర్ కొరివి వినయకుమార్ కోరారు. స్థానిక ఆ పార్టీ కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో ప్రజలు ఎదుర్కొంటున్న పలు సమస్యలపై రాష్ట్ర అధ్యక్షురాలికి విన్నవిస్తామని, దీనిపై కార్యాచరణ రూపొందిస్తామని చెప్పారు. గుంటూరు చానల్ ఆధునీకరణ, పొడిగింపుకు బడ్జెట్ కేటాయింపులు చేశామంటూ ప్రభుత్వం ప్రకటించడం మిహనా పనులు ప్రారంభం ఎప్పుడో చెప్పడం లేదని విమర్శించారు. బర్లీ పొగాకును మద్దతు ధరకు కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు.

బస్సుల్లో పిల్లలు భద్రమేనా?

(మొదటి పేజీ తరువాయి)

కొన్నిసార్లు ప్రమాదాలు జరగడం వంటి అంశాలను దృష్టిలో పెట్టుకుని ప్రస్తుతం ఎక్కువ మంది పాఠశాల బస్సుల్లోనే పిల్లల్ని పంపిస్తున్నారు. దీన్ని ఆసరాగా చేసుకుంటున్న పాఠశాల యజమాన్యాలు ఒక్కో విద్యార్థి నుండి ఏడాదికి రూ.10-15 వేల వరకూ వసూలు చేస్తున్నారు. పైగా పరిమితికి మించే విద్యార్థులను ఎక్కిస్తున్నారు. సాధారణంగా ఒక బస్సులో 25 నుండి 40 మంది విద్యార్థుల్నే ఎక్కించాల్సి ఉన్నా 60 మందిని కుక్కి తరలిస్తున్నారు.

పిడుగురాళ్ళ రవాణ శాఖ కార్యాలయం పరిధిలో 10 మండలాలు ఉండగా వీటిల్లో సుమారుగా 250కి పైగా స్కూల్ బస్సులు ఉన్నాయి. పాఠశాలలు పున: ప్రారంభమై వారం పూర్తయినా మొత్తం బస్సుల్లో 10 శాతం బస్సులు ఇంకా ఫిట్‌నెస్ పరీక్షలు చేయించుకోలేదని అధికారులు చెబుతున్నారు. మిగతా బస్సులు పరీక్షలు చేయించుకున్నా తూతూ మంత్రమేనని ఆరోపణలున్నాయి. బస్సులున్న ప్రతిపాఠశాలకు నోటీసులు ఇవ్వాల్సిన అధికారులు ఆ పనేమీ చేయకుండా మిన్నకున్నారు. బస్సుల్లో అధికభాగం కాలం చెల్లినవని, 15 ఏళ్లకుపైగా నడిచిన వాటిని పైపై మెరుగులు దిద్ది ఇప్పటికీ తిప్పుతున్నారనే విమర్శలున్నాయి. కొన్ని పాఠశాలలు సెంకండ్ హ్యాండ్ బస్సులను, కాలం చెల్లిన బస్సులను ఇతర ప్రాంతాల్లో తక్కువ ధరకు కొని నడిపిస్తున్నారనే ఆరోపణలూ ఉన్నాయి. అయితే ఫిట్‌నెస్ పరీక్షల్లో ఇవేమీ బయట పడకుండా ఒక్కో బస్సుకు రూ.5-7 వేల వరకు ముడుపులిచ్చి మేనేజ్ చేసుకుంటున్నారని ఆరోపణలూ ఉన్నాయి.

మోటారు వాహన చట్టాలు

మోటరు వాహన చట్టం ప్రకారం రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్, ఇన్సూరెన్స్, ఫిట్‌నెస్ సర్టిఫికెట్, పన్ను చెల్లింపు రసీదు, పోల్యూషన్ కంట్రోల్ సర్టిఫికెట్‌తో పాటు డ్రైవర్‌కు ఐదేళ్లపాటు భారీ వాహనం నడిపిన అనుభవం ఉండాలి. ప్రతి పాఠశాల బస్సుకు డ్రైవర్‌తో పాటుగా ఒక సహాయకుడు ఉండాలి, బస్సు కండీషన్‌లో ఉండటమే కాకుండా బ్రేక్ వేసినప్పుడు నాలుగు దిక్కులా పార్కింగ్ లైట్లు వెలిగేలా చూసుకోవాలి. ప్రథమ చికిత్స బాక్స్, ఫైర్‌సెఫ్టీ సిలిండర్, అత్యవసర ద్వారాలు ఉండాలి. చిన్నపిల్లలు బస్సు ఎక్కేలా మెట్లు కింది భాగంలో అదనంగా మెట్లు ఏర్పాటు చేయాలి. కిటికీలకు ఇరు వైపుల నాలుగు వరసల పైపులు, పిల్లలు తలలు బయటకి పెట్టకుండా జల్లెడ పెట్టుకోవాలి. బస్సు వేగంగా నడిపినా, అజాగ్రత్తగా వ్యవహరించినా, సెల్‌ఫోన్‌లో మాట్లాడుతూ బస్సు నడిపినా డ్రైవర్‌పై చర్యలు తీసుకునేలా పేరెంట్స్ కమిటీ ద్వారా బస్సులో ఫిర్యాదుల బాక్సు ఏర్పాటు

విద్యాసంస్థ పేరు కూడా విద్యార్థులను తరలిస్తున్న బస్సు

చేసుకోవాలి. బస్సుకు ముందు, రెండు వైపులా విద్యా సంస్థల పేర్లు, ఫోన్ నంబర్లు విధిగా రాయాలి. డ్రైవర్ వయసు 60 ఏళ్లలోపు ఉండాలి. డ్రైవర్‌కు ప్రతి 6 నెలలుకు ఒకసారి బిపి, షుగర్ తదితర వైద్య పరీక్షలు చేయించాలి. డ్రైవర్ ఫొటో, ఇతర వివరాలు బస్సు బయట ఏర్పాటు చేయాలి. అయితే ఈ నిబంధనలను పూర్తిస్థాయిలో ఏ పాఠశాల బస్సు కూడా పాటించడం లేదు. కొన్ని బస్సులైతే అసలు పాఠశాల పేరు కూడా రాయడం లేదు. పట్టణంలో పలు విద్యాసంస్థలకు చెందిన సుమారు 50కుపైగా బస్సులు ప్రతిరోజూ వందలాదిమంది విద్యార్థులను రవాణా చేస్తుంటాయి. వీరి భద్రత దృష్ట్యా అయినా అధికారులు స్పందించాలని, విద్యాసంస్థల బస్సులన్నీ నిబంధనలు పాటించేలా చూడాలని తల్లిదండ్రులు కోరుతున్నారు.

అధ్వానంగా పారిశుధ్యం

రోజుల రోజులు రోడ్ల మీద పేరుకుపోతున్న చెత్తా, చెదారం

కన్నెత్తి చూడని మున్సిపల్ అధికారులు

ప్రజాశక్తి - నరసరావుపేట

పేరుకే జిల్లా ప్రధాన నగరం ఒక ఐపీఎస్, ఒక ఐఎఎస్ స్థాయి అధికారులు ఉన్న నగరం నరసరావుపేట పట్టణం. అలాంటి స్థాయి ఉన్న నరసరావుపేట పట్టణంలో ఎక్కడ చూసినా చెత్త చెదారంతో డంపింగ్ యార్డులను తలపిస్తూ ఉంది. రామిరెడ్డిపేటలోని అన్నపూర్ణమ్మ హాస్పిటల్ ప్రక్క సంధులో ఎన్నో రోజులుగా చెత్తపేరుకుపోయి దుర్గంధం వెదజల్లుతుంది. పట్టణంలోని ప్రధానవీధుల్లో అరండల్‌పేట, రామిరెడ్డి పేట, బాలయ్యనగర్, వరవకట్ట లాంటి ప్రాంతా లలో కూడా ఈ సమస్య ఉంది. స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ అరవింద బాబు స్వచ్ఛ నరసరావుపేట అనే కార్యక్రమం చేపట్టి ప్రజలలో పారిశుధ్యం మీద అవగాహన కల్పిస్తూ పట్టణంలోని అన్ని వార్డులలో పారిశుద్ధ కార్యక్రమాలు చేపడుతూ క్లీన్ నరస రావుపేటగా మార్చాలని పురపాలక సిబ్బందితో, స్థానిక ప్రజలతో మమేకమై పారిశుద్ధ కార్యక్రమాలు చేపడు తున్నారు. కానీ పట్టణంలోని కొన్ని ప్రాంతాలలో మాత్రం చెత్తతో నిండి ఉన్న రోడ్లు దర్శనమిస్తున్నాయి. ఇవి పురపాలక అధికారులకు గానీ సిబ్బందికి గాని కనిపించడం లేదా అని స్థానికులు అంటున్నారు. చెత్తాచెదారంతోనే కాకుండా వీధి కుక్కలు, కోతులతో పట్టణ ప్రజలు ఎన్నో ఇబ్బందులు పడుతున్నారు. వీధి కుక్కల దాడులకు గురౌతున్న ప్రజలు వారి బాధలు ఎవరికి చెప్పుకోవాలో తెలియక ఆవేదన పడుతున్నారు. పట్టపగలే కుక్కలు, కోతులు దాడులు చేస్తూ ప్రజలను భయభ్రాంతులకు గురి చేస్తున్నాయి. రోజుల రోజులు పేరుకుపోతున్న చెత్తతో దోమలు పెరిగి డెంగ్యూ, మలేరియా, లాంటి ప్రాణాంతక విషజ్వరాల బారిన పడుతున్నామనీ, తమ బాధలు ఎవరికి చెప్పుకోవాలో తెలియక అలాగే భరిస్తున్నామని అంటున్నారు. ఇప్పటికైనా పురపాలక అధికారులు స్పందించి సమస్యలను పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.

రోడ్డుపై పేరుకుపోయిన చెత్త

మహారాజశ్రీ అద్దంకి ప్రిన్సిపల్ సియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో

I.A.144/2023
I.A.145/2023
I.A.146/2023
IN
O.S 101/2010

Between:
మున్నంగి లక్ష్మి సంపత్ కుమార్.... పిటిషనర్ /వాది
మరియు
గుర్రపుసాల అనంతలక్ష్మి (డైడ్) మరియు
7 మంది ...రెస్పాండెంట్స్ / ప్రతివాదులు

To
(1) గుర్రపుసాల సునందాదేవి,
భర్త లేటు వెంకట ప్రసన్న సురేష్ బాబు,
వయస్సు 38 సం.లు, **(6వ రెస్పాండెంట్)**
(2) గుర్రపుసాల లక్ష్మణ్ S/o లేటు వెంకట ప్రసన్న సురేష్ బాబు, వయస్సు9 సం.లు, మైనరు
(7వ రెస్పాండెంట్), అతనికి గార్డియన్
తల్లి గుర్రపుసాల సునందాదేవి
(3) గుర్రపుసాల పాప తండ్రి లేటు వెంకట ప్రసన్న సురేష్ బాబు, వయస్సు 6 సం.లు మైనరు
(8వ రెస్పాండెంట్), అమెకు గార్డియన్
తల్లి గుర్రపుసాల సునందాదేవి
అందరు చిన్న రథం బజారు, చిలకలూరిపేట టౌన్ మరియు మండలం, పల్నాడు జిల్లా.

పై నెంబరు దావాను వాది దావా పరిహారమును పొందు నిమిత్తం దాఖలు చేసియున్నారు. సదరు దావాలో 5వ ప్రతివాది అయిన గుర్రపుసాల వెంకట ప్రసన్న సురేష్ బాబు చనిపోయినందున అతని భార్య, కొడుకు, కూతురును 5వ ప్రతివాదికి వారసులుగా చేర్చమని దాఖలు చేయబడిన ఈనెంబరు పిటీషనులో 6,7,8 రెస్పాండెంట్లను చూపబడిన మీరు అటులనే I.A.146/2023 నెంబరులో ఆర్డరు 22 రూలు 4 ప్రకారం చనిపోయిన గుర్రపుసాల వెంకట ప్రసన్న సురేష్ బాబు 5వ ప్రతివాదికి వారసులుగా చేర్చమని దాఖలు కాబడిన ఈ నెంబరు పిటీషనులో 6,7,8 రెస్పాండెట్లుగా చూపబడిన మీరు అందులోనే I.A.145/2023 నెంబరున అర్డరు 22 రూల్ 9 సి.పి.సి. ప్రకారం చనిపోయిన 5వ ప్రతివాదికి వారసులను ఈ దావాలో పార్టీలుగా చేర్చుటకు జరిగిన కాలయాపనకు సంబంధించి ఎబెట్ మెంట్ ఆర్డర్ ను సెట్-ఎ-సైడ్ చేయమని కోరుచూ వాది దాఖలు చేసి ఈ పిటీషనులో 6,7,8 రెస్పాండెంట్లుగా చూపబడిన మీరు మరియు I.A.144/2023 నెంబరు సెక్షన్ 5 లిమిటేషన్ ఎబెట్ మెంట్ ఆర్డరు సెట్-ఎ-సైడ్ చేయమని కోరుతూ దాఖలు చేసిన పిటీషన్ కు జరిగిన 755 రోజులు ఆలస్యమును రద్దుపరచమని వాది దాఖలు చేసిన ఈ నెంబరు పిటీషనులో 6,7,8 రెస్పాండెంట్లుగా చూపబడిన మీరు ఈ విషయమై మీకు కోర్టు ద్వారా ఎన్నిసార్లు నోటీసులు పంపిన ప్పటికీ తీసుకొనక కాలయాపన చేయు చున్నందున ఈ పత్రిక ప్రకటన ద్వారా మీకు ఈ నోటీసు జారీ చేయవలసినదిగా శ్రీ కోర్టువారు ఉత్తర్వులు ఇచ్చి యున్నారు. ఇందు నిమిత్తమై మీకు గల అభ్యంతర ములు తేది. 14-07-2025వ తేదిన ఉదయం గం.10-30ని.లకు వాయిదా వేసియున్నందున పైకోర్టువారి ఎదుట స్వయముగా గాని, వకీలు ద్వారాగాని హాజరు అయ్యి మీ అక్షేపణలు తెలుపవలెను. లేనియెడల మీ పరోక్షమున విచారించి శ్రీకోర్టువారు తీర్మానించబడునని ఇందు మూలముగా తెలియజేయడమైనది.

// శ్రీ కోర్టువారి ఉత్తర్వుల మేరకు//

అద్దంకి
తేది : 23-06-2025

పి.యల్.యన్.ప్రసాద్, B.A., B.L.,
అడ్వకేట్,
అద్దంకి, బాపట్ల జిల్లా.
సెల్ నెం : **9848080806**

పల్నాడుకు ప్రాణవాయువు మెడికల్ కళాశాల

డాక్టర్ చింతలపూడి అశోక్ కుమార్

ప్రజాశక్తి-పిడుగురాళ్ల

పట్టణ సమీపంలో కామేపల్లి వద్ద 2019లో అప్పటి ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి ఆధ్వర్యంలో అప్పటి ఎమ్మెల్యే కాసు మహేష్ రెడ్డి ఈ ప్రాంతంలో మెడికల్ కాలేజీ వైద్యశాల నిర్మాణ పనులు చేపట్టారని పల్నాడు మెడికల్ కళాశాల అని వైద్యులు చింతలపూడి అశోక్ కుమార్ అన్నారు. ఆదివారం పల్నాడు హాస్పిటల్స్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఇప్పుడు అధికార పార్టీ వాళ్ళు అధికార వచ్చి ఏడాది కాలం అవుతున్నా ఒక శాతం కూడా పనులు ముందుకు సాగనీయలేదు అన్నారు. ఈ ప్రాంతంలో ప్రభుత్వ వైద్యశాల ప్రారంభమైతే సుమారు15 మండలాల పైగా ప్రజలకు వైద్య సేవలు అందుతాయని అన్నారు. ఈ ప్రాంతంలో ప్రభుత్వ వైద్యశాల అవసరం అందుకే కూటమి పార్టీ నాయకులు పూర్తి చేయాలని ఈ సందర్భంగా డిమాండ్ చేస్తున్నామని అన్నారు.

దొంగ హల్‌చల్

నిమిషం వ్యవధిలో ఆరు సెల్‌ఫోన్లు, ఉంగరం చోరీ

ప్రజాశక్తి- తాడేపల్లి

తాడేపల్లి పట్టణంలోని ఎన్టీఆర్ కరకట్టపై ఆదివారం తెల్లవారుజామున ఓ దొంగ ఇళ్లలోకి చొరబడి దొంగతనాలకు పాల్పడ్డాడు. సేకరించిన వివరాల ప్రకారం నాగేంద్రస్వామి పుట్ట సమీపంలో రోడ్డు వెంబడి వున్న నాలుగు నివాసాల్లో ఓ దొంగ దూరి సెల్ఫోన్లు, బంగారపు ఉంగరం చోరీ చేశాడు. గత వారంరోజులుగా ఉక్కపోతగా ఉండ డం తో ఆ ప్రాంతంలో నివాసముండే వారందరూ తలుపులు తీసి నిద్ర పోతున్నారు. ఇదే అదునుగా చేసు కున్న ఓ దొంగ మూడు నివాసాల్లో ఆరు సెల్ఫోన్లు, ఒక ఉంగరం దొంగిలించాడు. ఐదవ ఇంట్లోకి వెళ్లే సమయంలో వారు లేచి దొంగదొంగ అని అరవడంతో ఎన్టీఆర్ కరకట్ట దిగి పంటపొలాల్లోకి పరారయ్యాడు. స్థానికులు వెంబ డించినా అతని ఆచూకీ లభించలేదు. జరిగిన ఈ సంఘటనపై తాడేపల్లి పోలీసులను ఆశ్రయించి బాధితులు.

కార్పొరేటు శక్తులకు కొమ్ముకాస్తున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు

ప్రజాశక్తి - పెదకూరపాడు

కార్పొరేట్ శక్తులకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కొమ్ము కాస్తున్నాయని జిల్లా సిపిఐ కార్యదర్శి మారుతి వర ప్రసాద్ అన్నారు. ఆదివారం పెదకూరపాడు సిపిఐ మహాసభ ఆదివా రం జరిగింది. కార్యక్రమంలో పల్నాడు జిల్లా సిపిఐ కార్యదర్శి మారుతి వరప్రసాద్ మాట్లాడుతూ. స్థానిక సమస్యలపై సిపిఐ కార్యకర్తలు ఎప్పటికప్పుడు స్పందించి సమస్య పరిష్కారమయ్యే దిశగా అధికారులను కలవాలన్నారు. బిజెపి ఎన్డీఏ మూడవసారి అధికారంలోకి వచ్చి పేద అట్టడుగు వర్గాల ప్రజలకు తినడానికి తిండి లేకుండా చేస్తుందని మండిపడ్డారు. ప్రభుత్వ ఆస్తులను తన మిత్రులైన ఆదాని, అంబానీలకు దోచిపెడుతున్నారన్నారు. కార్మిక, రైతు వ్యతిరేక విధానాలను అవలంబిస్తూనే ఉందని, ప్రభుత్వ రంగ సంస్థలను కార్పొరేట్ పరంచేస్తుందని అన్నారు. రాష్ట్ర విభజన సమయంలో ఇస్తామన్నా విభజన హామీలను గాలికి వదిలేసారని అన్నారు. వామపక్ష పార్టీలు రాజీనామాతో విద్యార్థుల బలిదానా లతో నాడు పోరాడి సాధించుకున్న విశాఖ ఉక్కును ప్రైవేటుపరం చేయడానికి చూస్తుందని మండిపడ్డారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల ప్రజా వ్యతిరేక విధానాలపై ఎప్పటి కప్పుడు స్పందిస్తూ ఖండించాలని పార్టీ కార్యకర్తలకు ఆయన పిలుపునిచ్చారు. సిపిఐ సహాయ కార్యదర్శి కాస రాంబాబు, సిపిఐ కార్యవర్గ సభ్యులు ఏ. రాము మాట్లాడుతూ రాష్ట్ర జిల్లా మహాసభలు జరుగుతున్న నేపథ్యంలో శాఖా మహాసభలు నిర్వహిస్తారని తెలిపారు. పార్టీ శాఖలు బలపడి ప్రజా సమస్యలపై నిరంతరం పోరాటం చేద్దామని అన్నారు. మండల కమిటీ ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో కొమ్మాలపాటి శరత్, బైరాపట్నం రామకృష్ణ పాల్గొన్నారు.

ఎంప్లాయ్ ఐడి కార్డు పోయినది

పల్నాడు జిల్లా, నరసరావుపేట పట్టణం, ప్రకాష్ నగర్ R/o D.No. 12-1-9/1 కు చెందిన కొమ్ము రవి, S/o.చంద్రయ్య అను నేను యావన్మందికి తెలియజేయునది ఏమనగా నేను ఏపిఎస్ ఆర్టీసీ కానిస్టేబుల్‌గా డిపిటిఓ పల్నాడు ఆఫీస్ నందు పని చేస్తున్నాను. ది. 2-06-2025 న విధులుకు వెళు తుండగా జేబులో ఉన్న పర్స్, అందులో ఉన్న నా యొక్క ఎంప్లాయ్ ఐడి కార్డు (కార్డు నెం. E729975) మార్గం మధ్యలో ఎక్కడో పడిపోయినది. ఎంత వెదికినను దొరకలేదు. ఎవరికైనా దొరికిన యెడల పై అడ్రస్ లో లేదా సెల్. నెం. 7032573528 నందు సంప్రదించగలరు.

ట్రావెల్ ఐడి కార్డు పోయినది

పల్నాడు జిల్లా, నరసరావుపేట పట్టణం, ఐలా బజార్ R/o D.No. 20-3-62 కు చెందిన సూరిశెట్టి రమాదేవి W/o.రాజేంద్రప్రసాద్ అను నేను యావన్మందికి తెలియజేయునది ఏమనగా ఏపిఎస్ ఆర్టీసీ ఉద్యోగి అయిన నా భర్త పదవి విరమణ అనంతరం ఏపిఎస్ ఆర్టీసి సంస్థ నాకు మంజూరు చేసిన ట్రావెల్ ఐడి కార్డు (కార్డు నెం.103961) ది.15-06-2025 న గుంటూరు వెళ్లేందుకు ఇంటి వద్ద నుండి నరసరావుపేట ఆర్టీసి బస్టాండ్ కు ఆటోలో వెళుతుండగా మార్గం మధ్యలో ఎక్కడో పడిపోయినది. ఎంత వెదికినను దొరకలేదు. ఎవరికైనా దొరికిన యెడల పై అడ్రస్ లో లేదా సెల్ నెం:9392339595 నందు సంప్రదించగలరు.

దస్తావేజులు పోయినవి

పల్నాడు జిల్లా నకరికల్లు మండలం కుంకలగుంట గ్రామానికి చెందిన వనిపెంట. నర్సిరెడ్డి కు చెందిన సేల్ డిడ్ డాక్యుమెంట్స్, నెంబర్ 11468/2014. మరియు అగ్రిమెంట్ ఆఫ్ కన్స్ట్రక్షన్ కు సంబం ధించిన 11469/2014 నరసరావుపేట సబ్ రిజిష్టర్ ఆఫీస్. కుంకలగుంట నుండి బస్సులో నరసరావు పేటలో జిరాక్స్ తీసుకోవడానికి వెళుచుండగా దారి మధ్యలో పోయినాయి. ఎవరికైనా దొరికిన ఎడల 9550395011 నెంబర్ కు ఫోన్ చేసి అందజేయ గలరు వారికి తగిన పారితోషం ఇవ్వబడును.

ఇట్లు
వనిపెంట నర్సిరెడ్డి
ఫోన్ నెంబర్.9550395011

ఘనంగా పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

ప్రజాశక్తి - అమరావతి

హైస్కూల్ ప్రాంగణంలోని మల్లెల సక్కు బాయి సూర్యకిరణ్ ఆడిటోరియంలో 1982 పదో తరగతి పూర్ విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనాన్ని జరుపుకున్నారు. తమ చిన్ననాటి మధుర స్మృతులను గుర్తుచేసుకొని ఎంతో ఆనంద భరితులయ్యారు. ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించు కుంటూ గత స్మృతులను నెమర వేసుకున్నారు. మధురాను భూతులను గుర్తు చేసుకుంటూ ఆనంద పరవశం చెందారు.

యువకుడు ఆత్మహత్య

ప్రజాశక్తి - సత్తెనపల్లి రూరల్

రైలు కింద పడి యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ సంఘటన సత్తెనపల్లి రైల్వేస్టేషన్ సమీపంలో ఆదివారం జరిగింది. సత్తెనపలి పట్టణానికి చెందిన పిల్లుట్ల తిరుపతిరావు ఆత్మహత్య చేసుకున్నాడు. పట్టణంలో బార్బర్‌షాపులో పని చేస్తున్న తిరుపతిరావు కొంత కాలంగా మానసిక ఒత్తిడితో బాధ పడు తున్నాడు. ఈ నేపథ్యంలో పిడుగురాళ్ల వైపు నుండి గుంటూరు వైపు వెళుతున్న గూడ్స్ కింది పడి ఆత్మహత్య చేసుకున్నాడు. స్టేషన్‌మాస్టర్ ఫిర్యాదు మేరకు నడికూడి రైల్వే పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం సత్తెనపల్లి ఏరియా ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. రైల్వే పోలీసులు కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు.

చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే ఉపేక్షించం : ఎస్ఐ

ప్రజాశక్తి - మంగళగిరి రూరల్

రౌడీ షీటర్లు సత్ప్రవర్తనతో మెలగాలనీ, ఎలాంటి గొడవ లకు, చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు, భూదందాలకు పాల్పడకూడదని మంగళగిరి రూరల్ ఎస్సై సిహెచ్ వెంకట్ హెచ్చరించారు. ఆదివారం మంగళగిరి గ్రామీణ పోలీస్ స్టేషన్లో రౌడీ షీటర్లకు కౌన్సిలింగ్ నిర్వహించారు. రౌడీ షీటర్లు సత్ప్ర వర్తన కలిగి ఉండాలని, ఎలాంటి గొడవలకు, భూదందాలకు, ప్రజలను భయభ్రాంతులకు గురి చేయడం, దౌర్జన్యాలకు, అసాంఘిక చర్యలకు, చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు, పాల్పడ కూడదని, గ్రామీణ ప్రాంతాలలో విద్వేషాలు సృష్టించకుండా ఉండాలని, అన్ని వివాదాలకు దూరంగా ఉండాలని రూరల్ ఎస్ఐ సిహెచ్ వెంకట్ హెచ్చరించారు. గొడవలు సృష్టించి ప్రజలను భయాందోళనకు గురిచేస్తే పిడియాక్ట్ కేసులు నమోదు చేస్తామని ఆయన రౌడీ షీటర్లను హెచ్చరించారు. గ్రామీణ ప్రాంతాలలో ఎవరైనా రౌడీషీటర్లు, భూదందాలకు, చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే గ్రామీణ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేస్తే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని గ్రామ ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

రెచ్చిపోతున్న ట్రాన్స్‌ఫార్మర్ దొంగలు

కాపర్ వైరు కోసం ట్రాన్స్‌ఫార్మర్ల ధ్వంసం

ఉదయం రెక్కీ, రాత్రిచోరీ.. తీవ్రంగా నష్టపోతున్న రైతులు, విద్యుత్ శాఖ

ఇన్నారెడ్డి పొలంలో రాగివైరు కోసం ట్రాన్స్‌ఫార్మర్‌ను ధ్వంసం చేసిన దొంగలు

ప్రజాశక్తి - మాచర్ల

ఆరుగాలం కష్టపడి పంటలు పండించే రైతన్నలను దొంగలు దెబ్బతిస్తున్నారు. మెట్ట ప్రాంతం అధికంగా వున్న మాచర్ల ఏరియాలో వర్ష రము, నీటి బోర్లపై ఆధారపడి రైతులు పంటలు పండిస్తారు. లక్షల రూపాయల ఖర్చుచేసి 600 నుండి 1500 అడుగులు లోతు వరకు బోర్లు వేసి, విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు, మోటార్లు ఏర్పాటు చేసుకొని పాతాళంలో వున్న నీరు పైకి తెచ్చి పంటలు సాగుచేస్తున్న రైతన్నలను దొంగలు ఆర్థికంగా నష్టపరుస్తున్నారు.

రాగివైరు కోసం ట్రాన్స్‌ఫార్మర్ల ధ్వంసం..

ధ్వంసం చేసిన ట్రాన్స్‌ఫార్మర్ వద్ద దీనంగా ఓ రైతు

మాచర్ల ఏపిఎస్‌పి డిసిఎల్ అసిస్టెంట్ డివిజనల్ ఇంజనీర్ పరిధిలో ట్రాన్స్‌ఫార్మర్ల దొంగలు రెచ్చిపోతున్నారు. ట్రాన్స్ ఫార్మర్లలోని రాగి వైరు కోసం వ్యవసాయ క్షేత్రాల్లో వరుసగా దొంగతనాలకు పాల్పడుతున్నారు. మాచర్ల ఏపిఎస్‌పిడిసిఎల్ ఏడిఈ పరిధిలోని మాచర్ల పట్టణం, మండలం, దుర్గి, వెల్దుర్తి మండలాల్లోని వ్యవసాయ కేత్రాల్లో గుర్తుతెలియని దొంగలు ఇప్పటి వరకు 145 విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లను ధ్వంసం చేసి అందులోని రాగివైరు చోరీ చేశారు. దాంతో రైతులకు, విద్యుత్ శాఖకు లక్షలాది రూపాయలు నష్టం వాటిల్లింది. ప్రధాన రహదారి పక్కన, గ్రామాలలో వ్యవ సాయ భూములకు రోడ్డు సదుపాయాలు వున్న చోట్ల సింగిల్ ఫేజ్ ట్రాన్స్‌ఫార్మర్ల లక్ష్యంగా చోరీకి పాల్పడుతు న్నారు. ఉదయం పూట రెక్కీ చేసి, రాత్రుళ్ళు దొంగతనాలు చేస్తున్నారు. ఒక్కొక్క ట్రాన్స్‌ఫార్మర్ విలువ రూ. లక్ష నుండి 2.50లక్షలు ఉంటుంది. దొంగలు 16 కెవిఏ ట్రాన్స్ ఫార్మర్లను ఎక్కువగా ధ్వంసం చేసినట్లు విద్యుత్‌శాఖ అధికా రులు చెబుతున్నారు. మాచర్ల పట్టణంలోని ఆర్టీసీ గ్యారేజీ వెనుక ఉన్న బొడ్డు ఇన్నారెడ్డి పొలంలో ఉన్న 25 కె.వి.ఏ ట్రాన్స్‌ఫార్మర్‌ను సోమవారం దొంగలు పగలుగొట్టి రాగి తీగను దొంగిలించారు. పొలాల్లో జరుగుతున్న దొంగ తనాలను అరికట్టడం పోలీసులకు కష్టతరంగా మారింది.

కాయిల్స్, రిపేర్లకు, రీప్లేస్ ట్రాన్స్‌ఫార్మర్లకు లక్షల్లో ఖర్చు

పంటపొలాల్లోని ట్రాన్స్‌ఫార్మర్ల కాపర్ కాయిల్స్ ఎత్తుకెళ్లే దొంగలకు మిగిలేది రూ.5వేల లోపే. దొంగతనానికి గురైన ట్రాన్స్‌ఫార్మర్లకు మాత్రం రూ. లక్షా 50 వేల భారం ప్రభుత్వంపై పడుతోంది.దొంగతనం జరగ్గానే రైతులు విద్యుత్ అధికారులకు చెబితే, ట్రాన్స్‌కో సిబ్బంది పోలీసులకు ఫిర్యాదు చేయగా, వారు ఎఫ్ఐఆర్ చేసిన తరువాతే రిపేరు కోసం అనుమతి లభిస్తున్నది. వీలైతే మరమ్మత్తులు, లేకుంటే నూతన ట్రాన్స్‌ఫార్మర్ మళ్లీ యథాస్థానానికి చేర్చడానికి రోజుల సమయం పడుతున్నది. దాంతో పంటలకు తంతులు నష్టపోతున్నారు.

రూ.రెండు కోట్లు నష్టం

మాచర్ల విద్యుత్ శాఖ ఏడీఈ రామయ్య

మా పరిధిలోని వ్యవసాయ క్షేత్రాల్లో దొంగలు ట్రాన్స్‌ఫార్మర్లను ధ్వంసం చేయటం ద్వారా విద్యుత శాఖలకు రూ. రెండు కోట్లు నష్టం వాటిల్లింది. దొంగతనాల నియంత్రణకు అల్యూమినియం ట్రాన్స్ ఫార్మర్లను బిగిస్తున్నాం. దొంగలు ధ్వంసం చేసిన ట్రాన్స్‌ఫార్మర్లల్లో 52 అల్యూమినియం 25 కెవిఏ ట్రాన్స్‌ఫార్మర్లను రీప్లేస్ చేశాం. 16 కెవిఏ స్థానంలో 25కెవిఏ ట్రాన్స్‌పార్మర్ల రీప్లేస్ చేసే సమయంలో అధిక కెపాసిటికి రైతుల వద్ద నుండి రుసుము వసూలు చేస్తాం. దొంగల వల్ల పొలాల్లోని ట్రాన్స్ ఫార్మర్లు ధ్వంసం కాకుండా రైతులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలి.

దొంగతనాలను అరికట్టాలి

బండ్ల మహేష్, సిపిఎం నాయకులు, మాచర్ల

నాల్గుగైదు వేల రూపాయల కోసం దొంగలు లక్షల రూపాయల విలువజేసే ట్రాన్స్‌ఫార్మర్లను పగలుకొడుతున్నారు. దొంగలు చర్యలు వలన రైతులకు, ప్రభుత్వానికి ఎంతో నష్టం జరుగుతుంది. పంట పొలాల్లోని ట్రాన్స్ ఫార్మర్లను పగలగొట్టి రాగివైరు ఎత్తుకుపోతున్న దొంగల్ని పట్టుకోవాలి. దొంగల వలన ట్రాన్స్‌ఫార్మర్లను ధ్వంసం అయితే ప్రభుత్వమే ఆ నష్టాన్ని పూర్తిగా భరించాలి. రైతు వద్ద నుండి రూపాయి రుసుము వసూలు చేయ కుండా ధ్వంసం అయిన ట్రాన్స్‌ఫార్మర్ స్థానంలో కొత్తది బిగించాలి. పోలీసులు ప్రత్యేక టీంలు ఏర్పాటు చేసి దొంగతనాలు జరగకుండా చూడాలి.

ప్రజాశక్తి - చిలకలూరిపేట

పలు గ్రామాల్లోని పొలాల్లోని బోర్లకున్న వైర్లను దొంగలు సుమారుగా ఐదారు సంవత్స రాల నుంచి అక్కడక్కడ దొంగలించే వారినీ, ఇటీవల రెండేళ్లుగా దొంగతనాలు ఎక్కువ అయ్యాయని మండల, నియోజక వర్గ స్థాయిలో రైతులు గగ్గోలు పెడు తున్నారు. చిలకలూరిపేట మండల పరిధిలోఉన్నగోవిందపురం మద్ది రాల, మురికిపూడి, గోపాలంవారిపాలెం, రామ చంద్రపురం గ్రామలే కాకుండా నాదెండ్ల మండల పరిధిలో సంక్రాంతి పాడు, ఎడ్లపాడు మండలంలోని పలు గ్రామాలలో దొంగ తనాలు ఇటీవల ఎక్కువయ్యాయని రైతులంటున్నారు.

చిలకలూరిపేటలో ధ్వంసమైన ట్రాన్స్‌ఫార్మర్

తమ్మిశెట్టి నాగేశ్వరరావు అనే మురికిపూడికి చెందిన రైతు మాట్లాడుతూ ప్రతి సంవత్సరం 25, 30 ఎకరాల వ్యవసాయం సాగు చేస్తుంటానని మోటార్ల ద్వారా ఆరు తాళ్లకు నీరు ఉపయోగించే వారమన్నారు. అయితే పొలాల్లో ఉన్న మెటార్లను వదిలి ఒక్క కాపార్ వైర్లను మాత్రమే కట్ చేసి తీసుకెళ్తున్నారన్నారు. మురికిపూడి గ్రామంలో గల్లా రామ కోటేశ్వరరావు, ఆరుమల కోటయ్య, తమ్మిశెట్టి రామారావు, తమ్మి శెట్టి శ్రీరామ్ మూర్తి, పాలు ఇమాంస, పోలిశెట్టి నరసింహారావు, ఖాదరయ్య.. ఇంకా పలువురు రైతుల మోటార్లకు సంబంధించిన వైర్లను గతరొక్కులో రాత్రులు కట్ చేసుకుని పోయారని అన్నారు. ఒక్కొక్క రైతు రెండు,మూడు సార్లు దొంగిలించారని మరల వైర్లు బి గించు కోవటానికి సుమారు 15, 20 వేల ఖర్చులు అవు తున్నాయంటున్నారు. ఈ విషయమై చిలకలూరిపేట రూర ల్ పోలీస్ స్టేషన్లో పలుమార్లు పోలీసులకు ఫిర్యాదు చేసినపుడు వారు వచ్చి ఫోటోలు తీసుకుని ..వెళు తున్నారే కానీ ఫలితం మాత్రం ఏమి లేదని వాపోతున్నారు. ఇప్పటికైనా పోలీసులు ఉన్నతాధికారులు స్పందించి దొంగలను పట్టుకోక పోతే మునుముందు ఖర్చులు భరించ లేక వ్యవసాయం చేయలేని పరిస్థితులుంటాయన్నారు. ప్రస్తుత పరిస్థితులు అర్థం చేసుకొని వ్యవసాయ శాఖ పూర్తి స్థాయిలో సబ్సిడీ రూపంలో మోటార్లను దానికి సంబంధించిన వైర్లు ఇతర సామాగ్రిని ఇప్పించే ఏర్పాటు చేయాలని, పూర్తి స్థాయిలో బీమా సౌకర్యాన్ని కల్పించాలని రైతులు కోరుతున్నారు.

ట్రాన్స్‌ఫార్మర్ నుంచి కట్ చేసి తీసుకెళ్లిన కాపర్ వైరు

సభలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్సీ లక్ష్మణరావు

ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయాల్సిన అవసరం ఉంది

మాజీ ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు

ప్రజాశక్తి - మాచర్ల

పేద బడుగు బలహీన వర్గాల పిల్లలు చదువుకునే ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయాల్సిన అవసరం ఉందని మాజీ ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు అన్నారు. యుటిఎఫ్ నాయకులు ప్రభుత్వ ఉపాధ్యాయుడు గాదె కిరీట్ రెడ్డి ఈనెల 30వ తేదీన రిటైర్ అవుతున్న సందర్భంగా ఆదివారం స్థానిక వివిఎన్ గార్డెన్లో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ఇటీవల వెలువడిన పదవ తరగతి పరీక్షలలో ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థిని విద్యార్థులు మట్టిలో మాణిక్యాల వెలుగొందారని జిల్లా, జాతీయస్థాయి ర్యాంకులతో చరిత్ర సృష్టించారన్నారు. నాణ్యమైన విద్య అందించేందుకు ప్రభుత్వ పాఠశాలలను పటిష్ట పరచాలన్నారు. ఉపాధ్యాయల కొరత తీర్చాలన్నారు. పల్నాడు ప్రాంతం విద్యారంగంలో వెనుకబడిందని ఈ ప్రాంతంలో టెక్నికల్ ఎడ్యుకేషన్, పీజీ విద్య అందించేందుకు కృషి చేయాలన్నారు. కారంపొడిలో పాలిటెక్నికల్ కాలేజీ అవసరమని ప్రభుత్వానికి ఎన్నో మార్లు విజ్ఞప్తులు చేశామని, మాచర్ల ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో పీజీ సెంటర్ ఏర్పాటు చేయాలని కోరినట్లు తెలిపారు. తాను ఎమ్మెల్సీగా ఉన్న కాలంలో ప్రభుత్వ పాఠశాలల అభివద్ధికి ఎన్నో నిధులు వచ్చేలా కృషి చేశానన్నారు. కిరీట్ రెడ్డి మాస్టారు విద్యారంగంలోనే కాకుండా అనేక సేవా కార్యక్రమాలలో పాల్గొనే వారని కొనియాడారు. ఆయన సతీమణి విజయలక్ష్మి పండిట్‌తో కలిసి విద్యారంగంలో చేసిన కృషి అభినందనీయమన్నారు. కిరీట్‌రెడ్డి విజయలక్ష్మి పండిట్ దంపతులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ మదర్ సాహెబ్, ఎంఈఓ అల్లి సురేష్. న్యాయవాది నాగిరెడ్డి, యుటిఎఫ్ నాయకులు జెవికెఎస్ ప్రసాద్ పాల్గొన్నారు.

ముత్తుసెల్వన్‌ను అభినందిస్తున్న ఎమ్మెల్యే ఆంజనేయులు

పర్యావరణ సైక్లిస్ట్‌కు జీవీ ఆంజనేయులు రూ.10 వేల సాయం

ప్రజాశక్తి - వినుకొండ

పర్యావరణ పరిరక్షణే ధ్యేయంగా సైకిల్‌పై ప్రపంచ పర్యటన చేస్తున్న తమిళనాడుకు చెందిన సైక్లిస్ట్ ముత్తు సెల్వన్ కు వినుకొండ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు. రూ.10 వేల ఆర్థిక సాయం అందించారు. పర్యావరణం కోసం కృషి చేస్తున్న ఇలాంటి వ్యక్తులు సమాజానికి, ముఖ్యంగా యువతకు ఎంతో ఆదర్శమన్నారు. ముత్తు సెల్వన్ కొయంబత్తూరు నుంచి ఆదివారం వినుకొండకు చేరుకున్నాడు ఎమ్మెల్యే అతడికి స్వాగ తం పలికి, సాయం అందించారు అనంతరం మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ కోసం ముత్తుసెల్వన్ చేస్తున్న కృషి మరెంతో మందికి మార్గ దర్శనం అన్నారు. ముత్తుసెల్వన్ మాట్లాడుతూ గిన్నీస్ రికార్డు సాధన కోసం 1,111 రోజుల పాటు 5 దేశాల్లో 34,300 కి.మీ యాత్ర సాగిస్తున్నట్లు చెప్పారు. 2021 డిసెంబరు 21న ప్రారం భించి నేపాల్, బంగ్లాదేశ్, వియత్నాం, థాయ్‌లాండ్, బ్యాంకాక్, మయన్మార్ లో పర్యటించానని, వచ్చే ఏడాది డిసెంబర్ 21న దిల్లీలోని ఇండియా గేట్ వద్ద ముగించనున్నట్లు సెల్వన్ తెలి పారు. పర్యటనలో భాగంగా పది లక్షల మొక్కలు నాటిస్తున్నట్లు చెప్పారు. సైకిల్ చుట్టూ పర్య టన వివరాలు తెలిపే బోర్డులు, జాతీయ జెండా ఏర్పాటు చేశారు. అనంతరం ముత్తు సెల్వన్ నరసరావుపేట వైపు యాత్ర సాగించారు.

350 మందికి 'బాసట' వైద్యసేవలు

వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న వెంకాయమ్మ కుటుంబ సభ్యులు

మాట్లాడుతున్న గోపాల శివన్నారాయణ

ప్రజాశక్తి - యడ్లపాడు

ఎడ్లపాడు గ్రామంలో బాసట ఆధ్వర్యంలో ఆదివారం మెడికల్ క్యాంపు ఏర్పాటు చేశారు. క్యాంపులో బీపీ,షుగర్, కంటి పరీక్షలు, గుండె, మూత్రపిండాల పరీక్షలు నిర్వహించారు. స్వర్గీయ ఆలోకం వెంకాయమ్మ తృతీయ సంస్మరణ దినోత్సవ సభ జరిగింది. ఆలోకం పెద్దబ్బాయి, వారి కుమారుడు ఆలోకం సురేష్ వారి అల్లుడు వడ్డే సురేష ఆర్థిక సహకారంతో నిర్వహించిన క్యాంపునకు సంబంధించిన ఖర్చులన్నీ ఆలోకం పెద్దబ్బాయి భరించారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో గోపాల శివన్నారాయణ మాట్లాడుతూ ప్రజలు సంఘమిత్రులుగా ఉండవలసిన ఆవశ్యకతనీ, తల్లిదండ్రుల పట్ల బాధ్యతగా మెసులుకోవలసిన అవసరాన్ని తెలియజేశారు. మెడికల్ క్యాంపునకు ప్రోత్సహకంగా రూ. లక్ష విరాళంగా అంద జేశారు బాసట గౌరవాధ్యక్షులు నంబూరు నరసింహారావు మాట్లాడుతూ భవిష్యత్తులో మరిన్ని సేవా కార్యక్రమాల్ని నిర్వహిస్తామని కావలసిన సహాయ సహకారాలకు తామె ప్పుడూ ముందుంటామని తెలియజేశారు.

ఈ సందర్భంగా జరిగిన కంటి పరీక్షల్లో మొత్తం 350 మంది పాల్గొన్నారు. 100 మంది గుండె పరీక్షలు 200 మంది మూత్రపిండాల పరీక్షలు చేయించుకున్నారు. 300 మంది బిపి షుగర్ సంబంధించి టెస్టులు చేయించుకొని డాక్టర్ సలహా మేరకు మందులు తీసుకుని వెళ్లారు. ఎడ్లపాడు నుండి నారాయణ స్కూల్ విద్యార్థులు, లింగారావు పాలెం నుండి జడ్పీ హైస్కూల్లో చదివే విద్యార్థులు వాలంటీర్స్‌గా వచ్చి ఈ కార్యక్రమాన్ని జయప్రదం చేశారు. ఈ సందర్భంగా బాసట సభ్యులు లింగారావుపాలెం గ్రామ పెద్దలకి ఎడ్లపాడు గ్రామ పెద్దలకి వారి సహకారానికి కృతజ్ఞతలు తెలియజేశారు.

సుదర్శన్ కంటి ఆసుపత్రి వారు 300 మందికి పరీక్షలు నిర్వహించి 90 మందికి ఉచితంగా క్యాట్రాక్ చికిత్స చేసేందుకు నిర్ణయించారు. నుంచి డాక్టర్ అదితి, డాక్టర్ ప్రణీత్, వినోద్ కాశీ విశ్వనాథ్ పాల్గొని సేవలు అందించారు. కార్యక్రమంలో బాసట అధ్యక్షులు నూతలపాటి కాళిదాసు, బాసట ప్రధాన కార్యదర్శి సామినేని శ్రీనివాస్, బాసట సహాయ కార్యదర్శి ముత్తువరపు రవీంద్రబాబు, బాసట ఉపాధ్యక్షులు , రావూరి సుమన్, హేతువాద సంఘ నాయకులు సత్యనారాయణ, బిపి షుగర్ క్యాంపుల నిర్వహణని చేస్తున్న డాక్టర్ గోపాల శివనారాయణ పాల్గొన్నారు. డాక్టర్ సొంటినేని నవ్య డాక్టర్ గుంటుపల్లి దివ్య తేజ డాక్టర్ గుంటుపల్లి భవ్య తేజ డాక్టర్ ఎడ్ల రన్విత డాక్టర్ నెల్లటూరి రాజేశ్వరి ఆధ్వర్యంలో మెడికల్ క్యాంపు నిర్వహించారు. కార్యక్రమంలో బాసట సభ్యులు చెరుకూరి సృజన, కోయా రామోజీ సిహెచ్ రంగారావు, రావి సురేష్, పోపూరి శ్రీనివాసరావు, బచ్చు రాజేష్, సాయి ముత్తవరపు, ధర్మతేజ ముత్తవరపు, రావూరిసురేష్ ఎడ్లపాడు లింగారావుపాలెం విద్యార్థులు వాలంటీర్లుగా పాల్గొన్నారు.

ఎన్నికల హామీలను కూటమి ప్రభుత్వం అమలు చేయాలి

సిపిఎం గుంటూరు జిల్లా కార్యదర్శి వై.నేతాజీ

ప్రజాశక్తి - తాడేపల్లి రూరల్

కూటమి ప్రభుత్వం ఎన్నికలకు ముందు ప్రజలకు ఇచ్చిన హామీలు వెంటనే అమలు చేయాలని, సిపిఎం గుంటూరు జిల్లా కార్యదర్శి వై నేతాజీ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు ఎంటిఎంసీ పరిధిలోని గుండిమెడ గ్రామంలో సిపిఎం నాయకులతో కలిసి, విలేకరుల సమావేశాన్ని ఆదివారం ఉదయం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా నేతాజీ మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాది కాలం దాటిందన్నారు. ఇప్పటికీ ప్రజలకు ఇచ్చిన హామీలను ఏ ఒక్కటి నెరవేర్చలేదని ప్రభుత్వాన్ని ఆయన విమర్శించారు. అన్ని హామీలు అమలు చేశామని రాష్ట్ర ప్రభుత్వం ఉత్సవాలు జరుపుకుందని, ఏ మేరకు హామీలు అమలు చేశారో ప్రజలకు చెప్పాలని, సిపిఎం ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తుందన్నారు. మంగళగిరి నియోజకవర్గంలో ఇల్లు లేని పేదలకు ఇంటి స్థలంతో పాటు, ఇల్లు నిర్మించి ఇస్తామని మంత్రి లోకేష్ చెప్పారన్నారు. తాడేపల్లి పట్టణ, రూరల్ గ్రామాలలో ఏ ఒక్కరికి ఇళ్లస్థలం ఇవ్వలేదన్నారు. సొంతగా ఇళ్ల స్థలం ఉండి, గృహనిర్మాణ పథకం ద్వారా ఇల్లు

సమావేశంలో మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శి వై.నేజాతీ

నిర్మించుకు నేందుకు వేలాదిమంది ప్రజలు ఎదురుచూస్తున్నారని అన్నారు. ప్రత్యేకంగా ఇళ్ల పట్టాలు ఇస్తామని ఆనాడు లోకేష్ యువ గళం పాదయాత్రలో భాగంగా తాడేపల్లి ప్రాంతంలో శిలాఫలకం కూడా ఏర్పాటు చేశారని నేతాజీ గుర్తు చేశారు. మంగళగిరి నియోజకవర్గంలో 18 వేల మంది ఇళ్ల పట్టాల లబ్ధిదారులు ఉన్నారన్నారు. ప్రభుత్వం మొదటి విడత ప్రకటించిన దాంట్లో ఐదు వేల మందికి ఇళ్ల పట్టాలు ఇస్తామని చెప్పి, ఆచరణలో 3000 మందికి మాత్రమే ఇళ్ల పట్టాల పంపిణీ చేశారన్నారు. మిగిలిన 15 వేల మంది లబ్ధిదారులకు ఎల్ల పట్టాలు ఎప్పుడు ఇస్తారో ప్రశ్నార్ధకంగా మారిందని ఆయన విమర్శించారు. తాడేపల్లి పట్టణ పరిసర ప్రాంతాలలో ప్రతి అపార్ట్‌మెంట్‌లలో సమావేశాలు ఏర్పాటు చేసిన లోకేష్ అపార్ట్‌మెంట్ వాసుల మురుగు సమస్యను పరిష్కరించే దాంట్లో విఫలమయ్యారన్నారు. మురుగునీరు బయటికి పోయే దారి లేక, రాత్రి సమయా లలో అపార్ట్మెంట్ వాసులు మురుగునీరును ఎత్తి బయట పోసుకునే పరిస్థితి దాపురిం చిందన్నారు. మురుగునీరు బయటకు పంపేందుకు శాశ్వత పరిష్కారం చూపాలని సిపిఎం డిమాండ్ చేస్తుందన్నారు. కృష్ణానది పక్కనే ఉన్న తాడేపల్లి ప్రాంతంలో ఇప్పటికీ మంచినీటి సమస్య జటిలంగా ఉందని అన్నారు. మంచినీటి సమస్యను పరిష్కరిం చేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఎటువంటి చర్యలు చేపట్టలేదు అన్నారు. తాడేపల్లి ప్రాంతంలో రైతులు పండించిన పంటలు అమ్ముకునేందుకు, వినియోగ దారుల ఆకాంక్ష మేరకు రైతు బజార్ ఏర్పాటు చేయాలని అన్నారు. నిరుద్యోగ సమస్య పరిష్కారం కొరకు పరిష్కారమే ప్రభుత్వం చూపలేదన్నారు. నెల నెల మహిళలకు 1500 చొప్పున ఇస్తామని ప్రభుత్వం చెప్పి, ఆ హామీలను ఏడాది కాలం అవుతున్న నెరవేర్చలేదని ఆయన విమర్శించారు. ఎన్నికల ప్రచారంలో ఎసిసి కార్మికులకు నష్టపరిహారం ఇస్తామని మంత్రి లోకేష్ హామీ ఇచ్చారని అన్నారు. 200 రోజులుగా ఎసిసి కార్మికులు నిరాహార దీక్షలు చేస్తున్న పట్టించుకున్న పాపాన పోలేదని, సమస్య పరిష్కారం చేయాలని కార్మికులు లోకేష్ ను కలిసిన తన దగ్గరకే రావద్దని బెదిరించడం అన్యాయం అన్నారు. నియోజకవర్గంలో అనేక సమస్యలు పెండింగ్లో ఉండగా రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీలు అన్ని నెరవేర్చామని చెప్పడం సిగ్గుచేటు అన్నారు. తక్షణమే కూటమి ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చాలని సిపిఎం పార్టీ కోరుతుందన్నారు. ఈ సమావేశంలో సిపిఎం కమిటీ సభ్యులు ఎం సూర్యారావు, సిపిఎం గుంటూరు జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు బూరగా వెంకటేశ్వర్లు, సిపిఎం తాడేపల్లి మండల కార్యదర్శి పల్లె కృష్ణ, సిపిఎం సీనియర్ నాయకులు వేముల దుర్గారావు, సిపిఎం నాయకులు ఎస్.కె. గన్, పల్లె భార్గవ్, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

దీక్షల్లో పాల్గొన్న కార్మికులు

201వ రోజుకు ఎసిసి కార్మికుల దీక్షలు

ప్రజాశక్తి - తాడేపల్లి

తమకు చట్ట ప్రకారం న్యాయంగా రావలసిన బకాయిల కోసం ఎసిసి సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికులు చేస్తున్న దీక్షలు ఆదివారం నాటికి 201వ రోజుకు చేరుకున్నాయి. దీక్షలలో నారదాసు. సుబ్బారావు, షేక్ సుభాని, ఎం.శారద, బొందలపాటి నవనీతమ్మ, డి.రమణమ్మ కూర్చున్నారు. దీక్షలను యూనియన్ నాయకులు కూరపాటి స్టీవెన్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మికులకు తమ కష్టార్జితంగా రావలసిన బకాయిలను ఇప్పించాల్సిన బాధ్యత ప్రభుత్వం మీద ఉందని చెప్పారు. కంపెనీ యాజమాన్యం, ఇటు కార్మికవర్గ ప్రతినిధులను చర్చలకు ఆహ్వానించి సమస్యను పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కార్మికులు కె.హగ్గయ్య, ఎం.గురవయ్య, తుపాకుల నాగేశ్వరరావు, బి.సూర్యప్రకాశరావు, షేక్ ఆరిఫ్, డి.నాగేశ్వరావు, ఎం. సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు.

నేడు నీటి సరఫరా బంద్

ప్రజాశక్తి - తెనాలి

మరమ్మతుల కారణంగా సోమవారం పట్టణంలో పలు ప్రాంతాలలో తాగునీటి సరఫరా నిలిపివేస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ బి శేషన్న తెలిపారు. పట్టణంలోని మారీసుపేటలో తెనాలి చెన్నై రైలు మార్గంలో ఉన్న రైలు గేటు మరమ్మతుల కారణంగా స్థానికంగా ఉన్న వాటర్ ట్యాంకుల నుంచి నీటి సరఫరా నిలిపివేస్తున్నట్లు తెలిపారు. పినపాడు, గాంధీ పార్క్ న్యూ వాటర్ ట్యాంకు, ఉడా కాలనీలో వాటర్ ట్యాంక్, చినరావూరు వాటర్ ట్యాంకుల నుంచి నీటి సరఫరా నిలిపి వేస్తున్నట్లు తెలిపారు. పట్టణ ప్రజలు గమనించి సహకరించాల్సిందిగా కోరారు.

సాంబిరెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి నిళాలర్పిస్తున్న అన్నాబత్తుని

సాంబిరెడ్డి సేవలు చిరస్మరణీయం

ప్రజాశక్తి - తెనాలి

ఇటీవల మతి చెందిన రంగస్థల నటులు దర్శకులు కొండమడుగుల సాంబిరెడ్డి సంస్మరణ సభ ఆదివారం స్థానిక రామకష్ణ కవి కళాక్షేత్రంలో నిర్వహించారు. ముఖ్యఅతిథిగా మాజీ ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ పాల్గొని సాంబిరెడ్డి చిత్రపటానికి నివాళులు అర్పించారు. కళా రంగంలోనే కాకుండా పెదకాకాని దేవస్థానం ట్రస్ట్ బోర్డు మెంబెర్ మెంబర్‌గా సాంబిరెడ్డి సేవాలందించాలని కొనియాడారు. కె. సత్యనారాయణ, ప్రముఖ రంగస్థల నటులు శ్రీనివాసరావు, ఏపూరి హరిబాబు, గోపాలరెడ్డి, జె.సాంబ శివరావు పాల్గొన్నారు.. అనంతరం అద్దేపల్లి - ఆరాధ్యుల ఆర్ట్స్, తెనాలి వారి "ఎవరు" సాంఘిక నాటిక ప్రదర్శించారు. ఆరాధ్యుల తేజస్వి ప్రఖ్య రచనకు అద్దేపల్లి లక్ష్మణ శాస్త్రి దర్శకత్వం వహించారు.

క్రికెట్ టోర్నీ విజేతగా ఫణి క్రికెట్ క్లబ్

ప్రజాశక్తి - దుగ్గిరాల

తారకరామా క్రికెట్ అసోసియేషన్ వారి ఆధ్వర్యంలో మంత్రి నారా లోకేష్ సహకారంతో గత రెండు నెలల నుండి మండల కేంద్రం దుగ్గిరాలలో నిర్వహిస్తున్న జిల్లా స్థాయి క్రికెట్ పోటీలు ఆదివారం ఘనంగా ముగిశాయి. దాదాపు రెండు నెలల క్రితం అట్టహాసంగా ప్రారంభమైన ఈ పోటీలకు అకాల వర్షాలు అడ్డంకి కల్పించినప్పటికీ దిగ్విజయంగా నిర్వహించారు. క్రమం తప్పకుండా గత మూడు సంవత్సరాల నుండి ప్రతి సంవత్సరం వేసవిలో క్రికెట్ పోటీలు నిర్వహిస్తున్నారు. 50 జట్లు పాల్గొన్న ఈ పోటీలో తెనాలికి చెందిన ఫణి క్రికెట్ క్లబ్ టీం విన్నర్‌గా నిలిచి మొదటి బహుమతి 50వేల రూపాయలు గెలుచుకున్నది మంత్రి నారా లోకేష్ ఈ 50,000 రూపాయలను అందిం చారు. దుగ్గిరాలకు చెందిన బీమ్స్ ఆర్మీ రెండో స్థానంలో నిలిచి 30 వేల రూపాయలు బహుమతిని గెలుచుకుంది, స్థానిక ఖాన్ టింబర్ డిపో యజమాని జున్ను ఖాన్ ఈ నగదు బహుమతిని అందించారు. పెనుమూలి గ్రామానికి చెందిన పెనుమూలి క్రికెట్ క్లబ్ మూడో స్థానంలో నిలిచి 20 వేల రూపాయలు నగదు బహుమతిని గెలుచుకున్నది. సూర్య సోలార్ సిస్టం



గెలుపొందిన జట్టుకు షీల్డ్ అందిస్తున్న నిర్వాహకులు

అధినేత కె.ఎస్.రాజు ఈ నగదు బహుమతిని అందజేశారు. క్రీడాకారులకు వివిధ ప్రోత్సాహక బహుమ తుల కింద స్థానిక అలీనగర్‌కు చెందిన విశ్రాంత ఉద్యోగి మహమ్మద్ ముత్తుజా 20 వేల రూపాయలు సూర్య సోలార్ అధినేత కేఎస్ రాజు 15 వేల రూపాయలు అందించారు. ఈ కార్యక్రమంలో మండల టిడిపి అధ్యక్షులు కేశంనేని శ్రీ అనిత, గూడూరు వెంకటరావు ఎన్ఆర్ఐ జంపాల సుబ్బారావు మాజీ ఎంపీపీ వెనిగళ్ళ శ్రీకృష్ణ ప్రసాద్ గద్దె శ్రీనివాస్ పఠాన్ జున్ను ఖాన్ మహమ్మద్ ముర్తుజా, పార్వతినేని హర్ష, వల్లూరు నరసింహా రావు, పసుపులేటి రవి, దేవరపల్లి చంటి, నక్క చిరంజీవి, యేమినేని నేని కోటేశ్వరరావు పాల్గొన్నారు.

వైద్య శిబిరంలో మాట్లాడుతున్న డాక్టర్ రామ్‌కుమార్

అవోపా ఆధ్వర్యంలో ఉచిత వైద్యశిబిరం

ప్రజాశక్తి - గుంటూరు

గుంటూరు స్థానిక అరండల్‌పేటలోని అవోప కార్యాలయంలో ఆదివారం అవోప అధ్యక్షులు కేవీ బ్రహ్మం అధ్యక్షతన ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన అవగాహన సభలో కె.వి బ్రాహ్మం మాట్లాడుతూ అవోప సామాజిక సామాజిక సేవ కార్యక్రమాల్లో భాగంగా ఈరోజు ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించడం జరిగిందని అన్నారు. ఈవైద్య శిబిరంలో 260 మంది పేషెంట్లకు వివిధ రకాల వైద్య పరీక్షల, రక్తపరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేయడం జరిగినదని తెలిపారు. ప్రముఖ షుగర్ వ్యాధి వైద్య నిపుణులు డాక్టర్ రామ్ కుమార్ మాట్లాడుతూ షుగర్ వ్యాధి చిన్నపిల్లల నుండి పెద్దవారి వరకు వయసుతో సంబంధం లేకుండా వస్తున్నదని, జీవనశైలిలో, ఆహారపు అలవాట్లలో మార్పు చేయటం వల్ల షుగర్ వ్యాధిని నియంత్రించవచ్చునని తెలిపినారు. ప్రముఖ ఆర్థోపెడిక్ వైద్యులు డాక్టర్ భవనాసి కాశీ విశ్వనాథం 40 సంవత్సరాలపైబడిన అందరికీ ఎముకల సాంద్రత పరీక్షను ఉచితంగా చేసి తగు సూచనలు సలహాలను అందచేశారు. ఈ వైద్యశిబిరంలో డాక్టర్ కనిగల్పుల రామలింగేశ్వరరావు, డాక్టర్ దేవరశెట్టి అమర్, డాక్టర్ కొత్తమాసు ప్రణీత్‌కుమార్, డాక్టర్ దేవరశెట్టిపద్మజ, అవోపా కార్యదర్శి రాధాకష్ణయ్య ట్రెజరర్ మహంకాళి శ్రీనివాస్‌రావు, అమరా రమేష్ సునీల్ కుమార్ పాల్గొన్నారు.

9న జరిగే సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయండి

ప్రజాశక్తి - మంగళగిరి

కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం కార్మిక హక్కులను హరించే లేబర్ కోడ్స్ రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ జూలై 9వ తేదీన జరిగే దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెలో కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కార్మిక సంఘాల నాయకులు పిలుపునిచ్చారు. మంగళగిరి సీఐటీయూ కార్యాలయంలో ఆదివారం సిఐటియు, ఏఐటీయూసీ, ఏఐఎఫ్‌టియు న్యూ, వైయస్సార్సీపిటియు సంఘాల ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో వక్తలు మాట్లాడుతూ కేంద్రంలోని నరేంద్ర మోడీ ప్రభుత్వం గతంలో అనేక సంవత్సరాలు పోరాటాలు చేసి సాధించుకున్న కార్మిక చట్టాలను రద్దు చేయడం జరిగింది అని అన్నారు. దీని స్థానంలో కార్మిక హక్కులను కాలరాసే నాలుగు లేబర్ కోడ్స్

రౌండ్ టేబుల్ సమావేశంలో పాల్గొన్న కార్మిక సంఘాల నాయకులు

తీసుకురావడం జరిగిందని విమర్శించారు. దీనివలన కార్మికులు సంఘాలు పెట్టుకునే అవకాశం ఉండదని అన్నారు. పని గంటలు పెరుగుతాయని అన్నారు. కార్మికుల హక్కుల గురించి ప్రశ్నించేందుకు కూడా అవకాశం ఉండదని విమర్శించారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఎనిమిది గంటల పని దినాన్ని 12 గంటలకు పెంచుతూ నిర్ణయం తీసుకుందని విమర్శించారు. ఈ నిర్ణయాన్ని వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. సార్వత్రిక సమ్మెను జయప్రదం చేసేందుకు మంగళగిరి పట్టణంలోని అన్ని ప్రభుత్వ కార్యాలయాలకు, ప్రైవేటు సంస్థలకు సమ్మె నోటీసులు ఇవ్వాలని సమావేశం తీర్మానించింది. జూలై 7, 8 తేదీలలో మైక్ ప్రచారం నిర్వహించాలని తీర్మానించడం జరిగింది. ఈ సమావేశంలో సిఐటియు జిల్లా నాయకులు ఎస్ ఎస్ చెంగయ్య, వివి జవహర్లాల్, సిఐటియు పట్టణ అధ్యక్ష కార్యదర్శులు వై కమలాకర్, ఎం బాలాజీ, సిఐటియు సీనియర్ నాయకులు జెవి రాఘవులు, సిఐటియు నాయకులు టి.శ్రీరాములు, ఏఐటీయూసీ నాయకులు ఏ ప్రభాకర్, చిన్ని తిరుపతయ్య, నందం బ్రహ్మేశ్వరావు, జి.దుర్గారావు, పి.నాగేశ్వర రావు, బి.వెంకటేశ్వరరావు, ఏఐఎఫ్టీయూ న్యూ నాయకులు కె.కోటేశ్వరావు, వైయస్సార్ సిపిటియు నాయకులు ఆర్ శ్రీనివాస్ రాజు, నక్కా నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

బాధితులకు చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే ఆంజనేయులు

రూ.55.62 లక్షల సిఎం సహాయ నిధి చెక్కులు అందజేత

ప్రజాశక్తి - వినుకొండ

ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా బాధితుల్ని ఆదుకుంటున్న జాబితాలో వినుకొండ నియోజకవర్గం రాష్ట్రంలోనే టాప్-3లో నిలుస్తోందని చీఫ్ విప్, స్థానిక ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు అన్నారు. గడిచిన ఏడాదిలోనే వినుకొండ నియోజకవర్గ వ్యాప్తంగా 556 మంది బాధితులకు 3 కోట్ల 86 లక్షలు సీఎంఆర్ఎఫ్ ద్వారా సహాయం అందించడం రికార్డు అనీ, అందుకు సీఎం చంద్రబాబుకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిజేస్తున్నామన్నారు. వినుకొండలోని తన కార్యాలయంలో ఆదివారం ఆంజనేయులు మరికొంతమందికి సీఎం సహాయ నిధి చెక్కులు పంపిణీ చేశారు. నియోజకవర్గ పరిధిలోని 43 మంది లబ్దిదారులకు రూ.55.62 లక్షల విలువైన చెక్కులు అందించారు. కార్యక్రమంలో జీడీసీసీబీ ఛైర్మన్ మక్కెన మల్లికార్జున రావు సహా పలువురు స్థానిక నాయకులు పాల్గొన్నారు.

వర్థంతి సభలో మాట్లాడుతున్న వక్తలు

కళానిలయం కొనసాగింపునకు కృషి

ప్రజాశక్తి-చిలకలూరిపేట

అనేక రాష్ట్రాల,దేశ,విదేశాలలో కళాకారులను కళానిలయం ద్వారా 40 సంవత్సరాల పాటు నిరాటకంగా అనేక రకాలైన కార్యక్రమాలను నిబద్ధతతో, లక్ష్యంతో నిర్వహించటమే కాకుండా అనేక రాష్ట్రాలలో, దేశ, విదేశాల్లో అనేక సన్మానాలు పొందిన వ్యక్తి ప్రగడ రాజమోహనారావు అని ఆయన సంతాపం సభలో పలువురు వక్తలు అన్నారు. చిలకలూరిపేట ఖ్యాతిని దేశ విదేశాల్లో ఇనుమడింప చేసిన వ్యక్తి పి.ఆర్. మోహనరావు అన్నారు. స్థానిక ఆర్యవైశ్య వెంకటేశ్వర కల్యాణ మండపంలో ఆదివారం వర్ధంతి సభ జరిగింది. ముందుగా ఆయన చిత్రపటానికి పూలమాలవేసి గండి వాళ్ళ అర్పించారు. ఆహ్వానితుల మాట్లాడుతూ ఉభయ తెలుగు రాష్ట్రాలలో శత పురస్కారాలు చేయించుకున్న వ్యక్తి ప్రగఢ రాజమోనరావు అన్నారు. ఏ.వి. శివయ్య అధ్యక్షత వహించిన ఈ కార్యక్రమంలో మామిడి నెహ్రూ, సలీమ్, ఉమర్, పేరుబోయిన వెంకటేశ్వర్లు, డాక్టర్ రంగారావు, పేరూరి రామారావు, చిట్టిబాబు, నాయుడు శివయ్య, రావుసుబ్రహ్మణ్యం, కళాకారులు, కళాభిమానులు, గాయకులు, అభిమానులు పాల్గొన్నారు.

సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయండి

ప్రజాశక్తి - పెదకూరపాడు

జులై 9న జరిగే సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని సిఐటియు పల్నాడు జిల్లా సహాయ కార్యదర్శి గుంటూరు మల్లేశ్వరి కోరారు. ఆదివారం పెదకూరపాడు పంచాయతీ కార్మికుల సమస్యల గురించి అడిగి తెలుసుకున్నారు. పంచాయతీ కార్మికులకు నెలకు రూ. 6000 మాత్రమే ఇస్తున్నారన్నారు. అన్ని ధరలు విపరీతంగా పెరిగాయి. ఇచ్చిన హామీ ప్రకారం ఎనిమిది వేల రూపాయలు వెంటనే చెల్లించాలని కోరారు. సంక్షేమ పథకాలకు దరఖాస్తు చేసుకుంటే ప్రభుత్వ ఉద్యోగులుగా ఆన్లైన్లో కనిపిస్తుందని పంచాయతీ కార్మికులు ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సత్యవతి, రాణి బుజ్జి పాల్గొన్నారు.

సేంద్రీయ సేద్యానికి రైతుల ఆసక్తి

దుక్కుల సమయంలోనే చర్యలు - పొలాలకు తరలుతున్న ఎరువు

ట్రాక్టర్‌తో భూమిని దున్నుతున్న రైతు

పొలాల్లో మేస్తున్న జీవాలు

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

తొలకరి వర్షాలకు ముందు రైతులు తమ పొలాల్లో పశువుల ఎరువులు వేస్తుంటారు. కొద్దిరోజుల తర్వాత భూమిని దున్నే సమయంలో మరికొంత జీవాల ఎరువులు వేయడం ద్వారా భూమి సారవంతం అవుతుందని వ్యవసాయాధికారులు చెబుతున్నారు. రసాయనిక ఎరువుల వినియోగంవలన కలిగే అనర్థాలను గుర్తిస్తున్న పలువురు రైతులు భూసారం పెంపుపై దృష్టి సారిస్తున్నారు. తక్కువ ఖర్చుతో ఎక్కువ లాభాలనిచ్చే సేంద్రీయ ఎరువులను వినియోగించాలన్న వ్యవసాయాధికారుల సూచనల మేరకు గ్రామీణ ప్రాంతాలలో రైతులు పశువుల పేడ, మరి కొందరు చెరువు మట్టి పొలాల్లో వేసుకుంటున్నారు. వ్యవ సాయ శాఖ అధికారుల సూచన మేరకు రైతులు ఈ సేంద్రియ సాగు విధానానికి సన్నద్ధమవు తున్నారు. తరచూ రసాయన ఎరువుల వినియోగం వల్ల భూసారం తగ్గి పంటలకు చీడపీడలు సోకి ఉత్పత్తులు తగ్గుతున్నాయని రైతులు చెబుతున్నారు. సేంద్రీయ ఎరువుల వాడకం వల్ల రైతులకు ఎన్నో ప్రయోజనాలు ఉన్నాయని అధికారులు సూచిస్తున్నారు. పశువుల పేడ, గొర్రెలను నిలకట్టడం, పచ్చి రొట్ట ఎరువుల వినియోగం వలన భూసారం పెరగడమే కాకుండా నాణ్యమైన పంట ఉత్పత్తులు వస్తాయని భూమిలో తేమ శాతం ఎక్కువ రోజులు ఉండి పంటలు ఎండి పోకుండా దోహదపడతాయని చెబుతున్నారు. సేంద్రియ ఎరువులు వాడిన పొలాల్లో చీడపీడలు, తెగుళ్ల సోకవ న్నారు. పశువుల పేడలో నత్రజని, గొర్రెల ఎరువులో భాస్వ రం, జింక్, మెగ్నీషియం, ఐరన్, పొటాష్, బోరాన్ వంటి పోషక విలువలు లభించడంతో పంటలో నాణ్యమైన అధిక దిగుబడులు సాధించవచ్చని పేర్కొంటున్నారు.

సేంద్రియ సేద్యంతో నాణ్యమైన అధిక దిగుబడులు...

పంట వేసే ముందు పశువుల ఎరువును ఎకరాకు మూడు నుండి నాలుగు ట్రక్కులు వేసి బాగా కలియ దున్న డం వల్ల భూమి గుళ్లబారుతుంది. పంట దిగుబడి కూడా బాగుంటుంది. భూమిలో నీటి తేమ ఎక్కువగా ఉంటుంది. మొక్కలకు రోగ నిరోధక శక్తి పెరిగి పైరు ఎదుగుదల బాగుంటుంది. చీడపీడలు సోకకుండా ఉంటాయి.పొలంలో ఆయా ఎరువులతో పాటు వేపపిండి కలపడం ద్వారా పురుగులు నశిస్తాయి.

- ఐ. శాంతి, మండల వ్యవసాయ శాఖ అధికారి, నరసరావుపేట.

ట్రాక్టర్‌లో ఎరువును తరలిస్తున్న రైతు

ఉచిత మెగా వైద్యశిబిరం

1000 మందికి పరీక్షలు

ప్రజాశక్తి - దుర్గి

దుర్గి మండలంలోని కంచరగుంట గ్రామంలో మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల ఆవరణలో మాదాసు వెంకటేశ్వర్లు మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత మెగా వైద్యసేవలు నిర్వహించారు. ఈ శిబిరానికి మాచర్ల మార్కెట్ యార్డ్ మాజీ చైర్మన్ యాగంటి మల్లికార్జునరావు రిబ్బన్ కట్ చేసి వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పల్నాడు ప్రాంతంలోని వెనుకబడిన గ్రామాల్లో ఉచిత వైద్య శిబిరాలను ఏర్పాటు చేసిన ట్రస్ట్ వ్యవస్థాపకులు మురళీకృష్ణ గోపికృష్ణ ను అభినందించారు. ఇంటర్నేషనల్ కమ్యూనిటీ ఫర్ మెడిసిన్ అండ్ సైన్స్ ట్రస్ట్ వారి ఆశయం ప్రతి ఒక్కరికి ఉచితంగా వైద్యం అందించడమేనని ట్రస్ట్ ప్రెసిడెంట్ డాక్టర్ పి. రాజశేఖర్ ఆర్థోపెడిక్ సర్జన్ అన్నారు. వివిధ ప్రాంతాల నుండి వచ్చిన 13 మంది వైద్య నిపుణులు 22 రకాల వ్యాధులకు సంబంధించి దాదాపు 1000 మందికి పరీక్షలు నిర్వహించి అందులో 14 మందికి మెరుగైన వైద్యం కోసం గుంటూరు విజయవాడ వైద్యశాలలో పరీక్షలు నిర్వహించుకోవాలని సూచించారు. బిపి, షుగర్, థైరాయిడ్, ఈసీజీ ఎముకల కోసం బిఎండిపి ఎఫ్‌టి పరీక్షలను వైద్యులు ఉచితంగా చేశారు. వైద్య శిబిరంలో వైద్య నిపుణులు డాక్టర్ వి.బాల బాలాజీ, ఎం.ప్రసన్న కుమార్, పి వెంకట శ్రీధర్, ఎస్.ఉదయశంకర్, ఐ శ్రీనివాస్ ,బి మదుల, ఎన్.వి. పద్మిని, పి యశ్వంత్, కే వెంకటకష్ణ, రాజనాల మధు, ఆర్ సాయికృష్ణ , ఏ.మహేష్ కుమార్, సిబ్బంది, నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.

వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న యాగంటి మల్లికార్జునరావు

దేవాలయాన్ని పున:నిర్మించాలి

ప్రజాశక్తి - రాజుపాలెం

రహదారి నిర్మాణంలో కోల్పోతున్న బ్రహ్మంగారి దేవాలయ పునర్నిర్మాణానికి ప్రభుత్వం నిధులు మంజూరు చేయాలని సత్తెనపల్లి నియోజకవర్గ విశ్వబ్రాహ్మణ సంఘం అధ్యక్షులు చింతాడ రమేష్ కోరారు. ఆదివారం మండలంలోని అనుపాలెం గ్రామంలోని బ్రహ్మంగారి దేవాలయంలో సమావేశం నిర్వహించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత 40 ఏళ్లనాటి ఈ దేవాలయం పేరేచర్ల కొండమోడు రహదారి విస్తరణలో భాగంగా పూర్తిగా కోల్పోబడుతోందన్నారు. దాతల సహకారంతో 10 సెంట్లు స్థలంతో నిర్మించబడిన దేవాలయంలో ఐదేళ్ల కిందట గ్రామస్తులు భక్తుల వితరణతో సుమారు రూ.50 లక్షల పైగా వెచ్చించి మండప నిర్మాణం చేశారన్నారు. దేవాలయం పునర్నిర్మాణానికి ప్రభుత్వం నుండి, పార్లమెంటు సభ్యుల నిధుల నుండి రూ.కోటి 50 లక్షలు నిధులు మంజూరు చేయించాలని ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణను కోరారు. దేవాలయం పునర్నిర్మాణానికి గ్రామంలోని అన్ని వర్గాలతో స్థల దాతలు దేవాలయ అర్చకులతో నూతన కమిటీని ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. సమావేశంలో ఆర్.నాగభూషణం, కె.పోతు లూరయ్య, ఎస్.శ్రీనివాసరెడ్డి, బి.కోటి నాగిరెడ్డి, టి.రఘునాథరావు, ఆర్.చంద్రశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

విత్తన, ఎరువుల దుకాణదారులు నిబంధనలు పాటించాలి : ఎడిఎ

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

రైతులు గుర్తింపు పొందిన డీలర్ వద్ద విత్తనాలు, పురుగు మందులు కొనుగోలు చేసి తప్పనిసరిగా రసీదు పొంది పంట కాలం మొత్తం పూర్తయ్యే వరకు భద్రపరచాలని నరసరావుపేట సబ్ డివిజన్ వ్యవసాయ శాఖ ఏడిఏ పి.మస్తానమ్మ రైతులకు సూచించారు. ఈ మేరకు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. 2025-26 ఖరీఫ్ సీజన్ ప్రారంభం అవుతున్న నేపథ్యంలో అనుమతి పొందిన నాణ్యమైన అన్ని రకాల విత్తనాలు, పురుగు మందులు రైతులకు అందుబాటులో ఉన్నాయన్నారు. దుకాణ దారులు తప్పనిసరిగా దుకాణంలో విత్తనాలు, పురుగు మందులు, ఎరువుల వివరాలు తప్పనిసరిగా దుకాణంలో ఏర్పాటు చేసిన బోర్డు నందు పరిమాణం, కాలం చెల్లె తేదీ, ముద్రణ ధర, లాట్ నెం పొందుపరచడంతో పాటు ఆయా కంపెనీల అమ్మకపు అనుమతి పత్రం తప్పనిసరిగా కలిగి ఉండాలన్నారు. దుకాణంలో బోర్డు పై పొందుపరిచిన నిల్వలకు, స్టాక్ రిజిస్టర్ లో నమోదు చేసిన నిల్వలకు, వాస్తవ నిల్వలకు వ్యత్యాసం ఉంటే ఆయా నిల్వలు సీజ్ చేస్తామని హెచ్చరించారు. తరచూ విత్తన, పురుగు మందులు, ఎరువుల దుకాణాలను తనిఖీ చేస్తామని దుకాణంలో లూజు విత్తనాలు, అనుమతులు లేని నకిలీ బయో మందులు కలిగి ఉన్నా చర్యలు తీసుకుంటామని తెలిపారు. నకిలీ విత్తనాలను అరికట్టేందుకు ఇటీవల క్షేత్ర స్థాయిలో అన్ని రవాణా శాఖ కార్యాలయాలలో విస్తత తనిఖీలు చేపట్టామన్నారు. రవాణా కార్యాలయాలలో, దుకాణాలలో ఆకస్మిక తనిఖీలు నిర్వహిస్తూనే ఉంటామన్నారు.

మస్తానమ్మ, ఏడిఏ

దళారులు వద్ద కొనుగోలు చేయొద్దు..

నిషేధిత విత్తనాలు, పురుగు మందులు కొనుగోలు చేస్తే రైతులు నష్టపోయే అవకాశం ఉంది. కొందరు ఎరువుల వ్యాపారులు దిగుబడి అధికంగా వస్తుందని నమ్మించి, అనుమతి లేని వివిధ కంపెనీల కల్తీ ఎరువులు, పురుగు మందులు అంటగట్టే అవకాశం ఉంది. ముఖ్యంగా అనుమతులు లేని దుకాణాలు, దళారుల వద్ద కొనుగోలు చేయరాదు. తక్కువ ధరకే ఇస్తున్నారని కొని వాడితే పంట దిగుబడి తగ్గడంతో పాటు భూపారం దెబ్బతింటుంది. కొనుగోలు చేసేటప్పుడు మందుల లేబుళ్లను పరిశీలించి, అవి కంపెనీ ఎరువులా లేక స్థానికంగా తయారు చేసి విక్రయిస్తున్నారా అనే విషయాలను తెలుసుకోవాలి. కొనుగోలు చేసినప్పుడు తప్పనిసరిగా రశీదు తీసుకోవాలి.

నకిలీ అని తెలిస్తే ఫిర్యాదు చేయండి

గ్రామాలలో ఎవరైనా లైసెన్స్ లేకుండా విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు విక్రయిస్తున్నట్లు తెలిస్తే వెంటనే వ్యవసాయ అధికారులకు ఫిర్యాదు చేయాలి. మందుల లాట్ నంబర్ బట్టి తయారు చేసిన తేదీనీ గుర్తించి ఏ కంపెనీ, ఏ రకం వంటి విషయాలను చూడాలి. దుకాణం యజమాని సంతకంతో కూడిన బిల్లులను తప్పక తీసుకోవాలి. ముఖ్యంగా విత్తనాలకు సంబంధించిన సంచులపై సీలు తొలగించినట్లు గుర్తిస్తే వాటిని కొనుగోలు చేయకుండా నకిలీలపై ఫిర్యాదు చేయాలి. అధికారుల పరిశీలనలో అది వాస్తవమని తేలితే సంబంధిత డీలర్ పై కేసులు నమోదు చేసి రైతు లకు న్యాయం చేయడానికి అవకాశం ఉంటుంది.

ఏడాదైనా హామీ అమలు చేయని కూటమి ప్రభుత్వం

ప్రజాశక్తి-తెనాలిరూరల్

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి సంవత్సరం గడిచినా హామీలను అమలు చేయక పోవడం శోచనీయమని సిపిఎం తెనాలి మండలం రూరల్ కార్యదర్శి ములకా శివ సాంబిరెడ్డి తెలియ జేశారు. ఆదివారం కంచర్లపాలెం, గుడివాడ, కొలెవరం గ్రామాల్లో ప్రజలను కలిసి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. నిత్యావసర వస్తువుల ధరలు తారాస్థాయికి చేరుకున్నాయని తెలిపారు. రైతులు పండిస్తున్న ధాన్యం, జొన్నలు, మొక్కజన్నలు కొనుగోలు కేంద్రాలు ఏర్పాటుచేయక పోవడం అన్యాయమన్నారు. పంట కాల్వలు కొంత మరమ్మత్తులు చేసినా మురుగు కాల్వ మరమ్మత్తులు పూర్తిస్థాయిలో చేయకలేదని పేర్కొన్నారు. గుడివాడ, అంగలకుదురు గ్రామాల మధ్య కోపల్లెలో మైనర్ డ్రెయినేజి మరమ్మత్తులు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. 2019 చట్టం వలన కౌలు రైతులకు నష్టం జరుగుతుందని, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే దానిని రద్దుచేసి పేద రైతులకు మేలు చేయాలన్నారు. కౌలు రైతులకు రూ.20 వేల పెట్టుబడి సాయం అందిస్తామని చెప్పిన వాగ్దానాన్ని ఆచరణలో అమలు చేసేలా ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలని అన్నారు. తల్లికి వందనం లబ్ధిదారులు అందరికీ అందలేదన్నారు.

రూరల్ గ్రామ ప్రజలతో మాట్లాడుతున్న సాంబిరెడ్డి

ఎంట్రన్స్ పరీక్షల్లో కిరణ్‌కుమార్ ప్రతిభ

ప్రజాశక్తి - పెదకాకాని

పెదకాకానికి చెందిన బి ఫార్మసీ విద్యార్థి ఎం.కిరణ్ కుమార్ ఎంఎస్‌బి (ఎంఫామ్) ఎంట్రన్స్ పరీక్షల్లో ప్రతిభ చూపి 77వ ర్యాంక్ సాధించాడు. ఎన్.ఐ.పి.ఈ.ఆర్ జేఈఈ 2025 సెంట్రల్ యూనివర్సిటీలో ఎంఎస్ (ఎంఫార్మసీ) ఎంబీఏ రెండు సంవత్సరాల కోర్సు ప్రవేశం కొరకు కిరణ్ కుమార్ పరీక్షలు రాయగా శనివారం విడుదలైన ఫలితాలలో ఆల్ ఇండియా 77వ ర్యాంకు సాధించాడు. అదేవిధంగా మరొక ఎంట్రెన్స్ ఎగ్జామ్ మాస్టర్స్ (ఎంటెక్)లో ప్రవేశం కొరకు హాజరైన పరీక్షలలో ఆల్ ఇండియాలో 60వ ర్యాంక్‌లో నిలిచాడు. ఈ సందర్భంగా, గ్రామస్తులు, కిరణ్ కుమార్ చిన్ననాటి నుండి చదువులో మంచి ప్రతిభను కనబరుస్తూ, టెన్త్ క్లాస్‌లో పెదకాకాని హైస్కూల్‌కి కూడా మంచి పేరు తెచ్చాడని భవిష్యత్తులో ఉన్నత శిఖరాలకు కిరణ్ కుమార్ చేరుకోవాలని ఆకాంక్షించారు.

సమావేశంలో మాట్లాడుతున్న గాజుల శ్రీనివాసరావు

రోటరీ క్లబ్ అధ్యక్షులుగా ప్రగడ రాజశేఖర్

ప్రజాశక్తి - మంగళగిరి

మంగళగిరి రోటరీ క్లబ్ నూతన అధ్యక్షులుగా ప్రగడ రాజశేఖర్ ఎన్నికయ్యారు. ఆదివారం రోటరీ క్లబ్ ఆఫ్ మంగళగిరి సమావేశం చిన కాకానిలోని లిటిల్ విలేజ్ హెూటల్ ఆవరణలో గాజుల శ్రీనివాసరావు అధ్యక్షతన నిర్వహించారు. ముఖ్య అతిథిగా 3125 మాజీ గవర్నర్ అన్నే రత్నప్రభాకర్ పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా 2025-26 నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. రోటరీ క్లబ్ ఆఫ్ మంగళగిరి నూతన అధ్యక్షులుగా ప్రగడ రాజశేఖర్, ఉపాధ్యక్షులుగా అందే మురళి, కార్యదర్శిగా పారేపల్లి నిరంజన్ గుప్తా, సహాయ కార్యదర్శులుగా కాపరౌతు సుందరయ్య,జన్నాదుల భిక్షారావు, కోశాధికారిగా కెవిఎస్ ప్రకాశరావును ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో పబ్లిక్ రిలేషన్ రావెల శ్రీనివాసరావు, జీఎస్ నాయక్, గోలి శ్రీకాంత్, చనుమోలు గోపాల్, ఉడతా శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల అపూర్వ కలయిక

ప్రజాశక్తి-తెనాలిరూరల్

51 ఏళ్ల క్రితం 10వ తరగతి చదువుకున్న పూర్వ విద్యార్థులు ఆదివారం ఆత్మీయంగా కలుసుకున్నారు. 1973-74 బ్యాచ్‌కు చెందిన విద్యార్థులంతా రూరల్ మండలం కొలకలూరు గ్రామం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యనభ్యసించారంటే అతిశ యోక్తికాదు. అర్ధ శతాబ్దం పూర్తయి ఒకేచోట హాజరైన ఈ కలయికలో ప్రేమాభిమానాలు వెల్లువెత్తాయి. పాత జ్ఞాపకాలను నెమరువేసు కుంటూ ఒకరినొకరు ఆత్మీయ ఆలింగనం చేసుకున్నారు. అలనాటి మేటి గురువులను తలచుకుంటూ ప్రస్తుత పాఠశాల ఉపాధ్యాయులను గౌరవించు కున్నారు. పది పూర్తయ్యి 50 ఏళ్ళు గడచిన సందర్భంగా తమ ఆనం దానికి అవదుల్లేవని పూర్వ విద్యార్థులు సంతోషం వ్యక్తంచేశారు.

ట్రాఫిక్ కష్టాలు లేకుండా చేసే బాధ్యత అధికారులదే

ప్రజాశక్తి - గుంటూరు

శంకర్ విలాస్ బ్రిడ్జి పనులు ప్రారంభిస్తున్న నేపథ్యంలో అధికారులు విధిస్తున్న నిబంధనల వల్ల గుంటూరు వాసులు ఎదుర్కొనబోయే ట్రాఫిక్ కష్టాలకు అధికారులే బాధ్యత వహించాలని పలువురు వక్తలు అన్నారు. ఆదివారం అవగాహన సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన చర్చాగోష్టిలో అవగాహన కార్యదర్శి కొండా శివరామిరెడ్డి మాట్లాడుతూ శంకర్ విలాస్ బ్రిడ్జిని పడగొట్టి, కొత్త బ్రిడ్జి కట్టే విషయంపై గత ఆరు నెలలుగా జిల్లాతోపాటు, రాష్ట్రవ్యాప్తంగా పెద్ద ఎత్తున చర్చ జరుగుతుందన్నారు. బ్రిడ్జిని ఎలా నిర్మిస్తారు... ట్రాఫిక్‌ను ఎలా నియంత్రిస్తారు. ఎప్పుడు ఏతీరులో నిర్మాణం ప్రారంభిస్తారో అనే విషయాలపై నగర వాసులు అందరూ నిశితంగా పరిశీలిస్తున్నారని అన్నారు. రాజ్యాంగ చర్చావేదిక కన్వీనర్ ఎ.హరి మాట్లాడుతూ కొత్తగా అమలు చేయనున్న ట్రాఫిక్ మళ్లింపు ప్రకటనలతో అందరూ ఆందోళన చెందుతున్నారని, సమావేశంలో విద్యావేత్త సింగరయ్య, ట్యాక్స పేయర్స్ నాయకులు మురళీకృష్ణ, చంద్రశేఖర్ ప్రసంగించారు.

మాట్లాడుతున్న కొండా శివరామిరెడ్డి

క్షయ నివారణ సాధ్యమే : డాక్టర్ శాంతకుమారి

ప్రజాశక్తి - తాడేపల్లి

మద్యపానం, ధూమపానం, షుగర్ వ్యాధిగ్రస్తులు, గతంలో టీబీ మందులు వాడిన వారి దగ్గరగా ఉండే వ్యక్తులు క్షయ వ్యాధి గురై అవకాశం ఉందని తాడేపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ప్రధాన వైద్యులు శాంతకుమారి తెలిపారు. క్షయ వ్యాధి గురైన వారు భయపడాల్సిన అవసరం లేదని, అందు కు తగ్గ మందులు అందుబాటులో ఉన్నాయని ఆమె చెప్పారు. టి.బి. ముక్తి భారత్ కార్యక్రమంలో భాగంగా ఆదివారం తాడేపల్లి పీహెచ్సీలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. రెండు వారాల నుండి దగ్గు రావడం, అ కలి మందగించటం, బరువు తగ్గిపోవడం, దగ్గుతున్నప్పుడు కళ్ళే రావటం, కల్లె లో రక్తం పడటం , ఇలాంటి లక్షణాలు ఉంటే దాన్ని టీ బి వ్యాధిగా గుర్తించాలని , దగ్గర్లో ఉన్న ఆశా కార్యకర్తలు, ఏఎన్ ఎం మరియు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సంప్రదించాలని సూచించారు. జూలై నెలలో కొత్తనీరు రావడం వల్ల నీళ్ల విరోచనాలు వచ్చే అవకాశం ఉందని హెచ్చరించారు. చేతులు పరిశుభ్రంగా ఉంచుకోవడంతో పాటు ఇంటి పరిసరాలు కూడా శు భ్రంగా ఉంచుకోవాలని కోరారు.

అవగాహన కార్యక్రమంలో మాట్లాడుతున్న శాంతకుమారి

హార్మోన్ల సమతుల్యతతోనే ఆరోగ్యం

ప్రజాశక్తి - గుంటూరు

శరీరంలో హార్మోన్ల సమతుల్యత దెబ్బతినటమే ఏ అనారోగ్య సమస్యకైనా కారణమని కిమ్స్ శిఖర హాస్పిటల్ వైద్యుడు ప్రముఖ ఎండోక్రైనాలజిస్ట్ డాక్టర్ జి.ఉమామహేశ్వరరావు అన్నారు. ఆదివారం అరండల్‌పేటలోని అవగాహన కార్యాలయంలో నిర్వహించిన ఆరోగ్య సభలో డాక్టర్ ఉమామహేశ్వర రావు మాట్లాడుతూ మన శరీరంలో జరిగే అన్ని క్రియలకు హార్మోన్ల అవసరం ఎంతో ఉందన్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో చాలామంది శారీరక వ్యాయామం లేక, అధిక మొత్తంలో ఆహారం తీసుకుంటూ, స్వచ్ఛమైన వాతావరణంలో జీవించక అనేక అనారోగ్య సమస్యలకు గురవుతున్నారని అన్నారు. మధుమేహం వల్ల మన శరీరంలో నరాలు దెబ్బతిని నెఫ్రోపతి, కార్డియోమా యోపతి, న్యూరోపతి, రెటీనోపతి మొదలగు సమస్యలు తలెత్తుతున్నాయన్నారు. . థైరాయిడ్ సమస్య గురించి తెలియజేస్తూ థైరాక్సిన్ హార్మోన్‌లో అసమతుల్యత వల్ల వస్తుందన్నారు. ఇందులో హైపర్ థైరాయిడిజం, హైపో థైరాయిజం వంటి రెండు రకాలు ఉన్నాయన్నారు. హైపర్ థైరాయిడిజంకు గురైన వారిలో బరువు తగ్గడం, సన్నబడటం హైపర్ యాక్టివ్ అవడం లాంటి లక్షణాలు కనబడతాయి. ఈ లక్షణాలు ఉన్న వారు డాక్టర్‌ను సంప్రదించి క్రమం తప్పకుండా మందులు వాడుకుంటూ, థైరాక్సిన్ హార్మోన్‌ను బ్యాలెన్స్‌గా ఉండే విధంగా చూసుకోవాలి సూచించారు. అదే విధంగా ఆస్టియో ఫోరోసిస్ గురించి వివరించారు. సభకు టీవీ సాయిరాం కోఆర్డినేటర్‌గా వ్యవహరించగా, గాయత్రి బ్యాంక్ మేనేజర్ టి సుబ్బారావు, వేమన ట్రస్ట్ అధ్యక్షుడు చల్లా అంజిరెడ్డి, హ్యూమన్ రాడికలిస్ట్ కే.చంద్రశేఖరరావు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న డాక్టర్ ఉమా మహేశ్వరరావు

అన్నదానం చేస్తున్న సభ్యులు

వృద్ధులకు అన్నదానం

ప్రజాశక్తి - పొన్నూరు

మన పొన్నూరు బ్లడ్ వెల్ఫేర్ అసోసియేషన్ వారి ఆధ్వర్యంలో గుంటూరు జిల్లా వెల్లలూరు గ్రామానికి చెందిన కీర్తిశేషులు సుధా వెంకటేశ్వరరావు సముద్రయ్య వాసు జ్ఞాపకార్థం నిడుబ్రోలు రైల్వే స్టేషన్ దగ్గర ఓవర్ బ్రిడ్జి కింద ఉంటున్న పేదవారికి భోజనం ప్యాకెట్లు అందజేశారు. ఈ కార్యక్రమానికి సహకరించిన వెంకటేశ్వరరావు గారి భార్య శివ నాగేశ్వరమ్మ కుమారుడు రామచంద్రరావు కుమార్తె పుష్పల రత్నకుమారి వారికి మన పొన్నూరు బ్లడ్ వెల్ఫేర్ అసోసియేషన్ తరపున కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో కార్యదర్శి గుడివాడ పవన్ ట్రెజరరీ చిలకపాటి సింహాద్రి తదితరులు పాల్గొన్నారు. అన్నదానం రక్తదానం చేయాలి అనుకున్న వాళ్ల ఫోన్ నెంబర్ 8333089722కు సంప్రదించాలని నిర్వాహకులు తెలిపారు.

శామ్యూల్‌కు నియామక పత్రం అందజేస్తున్న కాంగ్రెస్ నాయకులు

కాంగ్రెస్ పార్టీ తాడేపల్లి పట్టణ అధ్యక్షులుగా దర్శన శామ్యూల్

ప్రజాశక్తి- తాడేపల్లి

కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షులు వైఎస్ షర్మిల రెడ్డి, జిల్లా అధ్యక్షులు సిహెచ్.విజయ్ కుమార్ ఆదేశాల మేరకు తాడేపల్లి పట్టణ అధ్యక్షులుగా దర్శన సామేలు, తాడేపల్లి రూరల్ అధ్యక్షులుగా షేక్ సుభాని, మంగళగిరి మండల అధ్యక్షులుగా కె.కృష్ణారావును నియమించినట్లు కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి షేక్ సలీం తెలిపారు. ఈమేరకు నియామక పత్రాలు వారికి అందజేశారు. ఈ సందర్భంగా తాడేపల్లి బైపాస్ రోడ్‌లోని కాంగ్రెస్ కార్యాలయంలో సలీం మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేయడానికి అందరం కలిసి చేద్దామని చెప్పారు.ఈ కార్యక్రమంలో మంగళగిరి నియోజకవర్గ మహిళ కాంగ్రెస్ అధ్యక్షురాలు షేక్ మున్ని, జిల్లా కాపు సంఘం సాధికర చైర్మన్, రేమిడి శెట్టి హనుమంత్ రావు, రాష్ట్ర చేనేత వివర్స్ చైర్మన్ రామనాథం పూర్ణ చంద్రరావు, తదితరులు పాల్గొన్నారు.

జ్యోతి ప్రజ్వలన చేస్తున్న రత్న ప్రభాకర్

రోటరీ క్లబ్ డైరెక్టర్లకు శిక్షణ

ప్రజాశక్తి - తెనాలి

రోటరీ క్లబ్ ఆఫ్ తెనాలి వైకుంఠపురం ఆధ్వర్యంలో స్థానిక కార్యాలయంలో ఆదివారం బోర్డ్ ఆఫ్ డైరెక్టర్స్ ట్రైనింగ్ సెమినార్ కార్యక్రమం నిర్వహించారు. అసిస్టెంట్ గవర్నర్ ఈదర వెంకట పూర్ణచంద్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన కార్యక్రమాన్ని ఫాస్ట్ గవర్నర్ అనే రత్న ప్రభాకర్ జ్యోతి ప్రజ్వలతో ప్రారంభించారు. అనిల్ చక్రవర్తి, డాక్టర్ విష్ణు బాబు, కె.సీతారమేష్ డైరెక్టర్లకు శిక్షణను ఇచ్చారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు ఈదర శ్రీనివాసరావు, డి.మురళీకృష్ణ, ఎన్.వెంకటేశ్వరరావు, జి.వి.నారాయణ, వి.హరిప్రసాద్, జి.వెంకటరత్నం, డి.రవీంద్రనాథ్ పాల్గొన్నారు.

ఎంపికైన క్రీడాకారులు

జిల్లా ఫుట్‌బాల్ జట్టుకు 22 మంది ఎంపిక

ప్రజాశక్తి - గుంటూరు

గుంటూరు జిల్లా ఫుట్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం పేరేచర్ల గ్రౌండ్‌లో జూనియర్ బాయ్స్ (2010, 2011) కేటగిరికి సంబంధించి సెలక్షన్స్ జరిగాయి. ఈసెలక్షన్స్‌లో 42 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. వీరిలో 22 మందిని ఎంపిక చేసి, త్వరలో జరగబోయే నల్లమల్ల జోన్ లీగ్‌మ్యాచ్‌లో పాల్గొంటారని గుంటూరు జిల్లా ఫుట్‌బాల్ అసోసియేషన్ ప్రెసిడెంట్ కుమ్మర క్రాంతికుమార్, గుంటూరు జిల్లా సెక్రటరీ దుర్గామోహన్ ఆదివారం తెలిపారు.

ఆగస్టు 8న విద్యుత్ కాంట్రాక్ట్ కార్మికుల చలో విజయవాడ

ప్రజాశక్తి - గుంటూరు

విద్యుత్ కాంట్రాక్ట్ కార్మికుల సమస్యలపై ఆగస్టు 8న చలో విజయవాడ కార్యక్రమాన్ని విజయవంతం యునైటెడ్ ఎలక్ట్రిసిటీ కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జె.రాజశేఖర్, ఎ.వి.నాగేశ్వరరావు పిలుపునిచ్చారు. ఆదివారం సిఐటియు కార్యాలయంలో నిర్వహించిన యూనియన్ ఆఫీస్ బేరర్స్ సమావేశంలో ఈ మేరకు నిర్ణయం తీసుకున్నారు. విద్యుత్ సంస్థలో గత రెండు శతాబ్దాలుగా వెట్టి చాకిరి చేస్తున్న కాంట్రాక్టు కార్మికులను సంస్థలోకి విలీనం చేసుకొని, రెగ్యులర్ చేయాలని, కోరారు. అర్హులైన కార్మికులకు షిఫ్ట్ ఆపరేటర్ పోస్ట్‌లకు అవకాశం కల్పించాలనే డిమాండ్లపై న్యాయమైన పోరాటం చేస్తున్నామని తెలిపారు. అయినా యాజమాన్యం నిమ్మకు నీరెత్తినట్లు ఉందన్నారు. అందువల్ల సమస్యలు పరిష్కారానికి ఛలో విజయవాడ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రతి కార్మికుడూ ఈ కార్యక్రమంలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. సమావేశంలో రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ బజ్జా సుమన్, రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి ముజఫర్ అహ్మద్, రాష్ట్ర ఉపాధ్యక్షులు శ్రీనివాసరావు, జి.నాగరాజు జిల్లా నాయకులు జి.పవన్, కె.రాంబాబు పాల్గొన్నారు.

హాస్పిటల్‌లో ఏర్పాటు చేసిన కొత్త టెక్నాలజీ పరికరాలతో డాక్టర్ నాగశ్రీ హరిత, డాక్టర్ ఎ.శివప్రసాద్

కిమ్స్ శిఖరలో అత్యాధునిక టెక్నాలజీ

ప్రజాశక్తి - గుంటూరు

కిమ్స్ శిఖర హాస్పిటల్‌లో బోస్టన్ సైంటిఫిక్ సంస్థ రూపొందించిన అధునాతన ఎవివిఐజిఓ + ఐవియుఎస్ కన్సోల్‌ను ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోనే మొట్టమొదటిసారిగా ఏర్పాటు చేశారు. అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన ఈ సాంకేతిక పరికరం ద్వారా అంతర్గత రక్తనాళాల చిత్రీకరణ (ఇంట్రావాస్క్యులర్ ఇమేజింగ్), ఇంటర్వెన్షనల్ కార్డియాలజీ రంగాల్లో ఒక కీలక అంశాల గురించి తెలుసుకోవచ్చు. ఈ వ్యవస్థను కిమ్స్ శిఖర హాస్పిటల్‌లో సీనియర్ ఇంటర్వెన్షనల్ కార్డియాలజిస్ట్, కార్డియాక్ సైన్సెస్ డైరెక్టర్ డాక్టర్ పర్వతనేని నాగశ్రీ హరిత, సీనియర్ ఇంటర్వెన్షనల్ కార్డియాలజిస్ట్ డాక్టర్ అకుల శివప్రసాద్‌ల ఆధ్వర్యంలో కిమ్స్ శిఖర హాస్పిటల్‌లో ప్రారంభించారు. ఈ వ్యవస్థ రక్తనాళాలలో జరిగే శస్త్రచికిత్సల సమయంలో అత్యద్భుతమైన స్పష్టతతో తక్షణ చిత్రాల ద్వారా వైద్యుల నిర్ణయ సామర్థ్యాన్ని మెరుగుపరుస్తుందని వారు అన్నారు. 'ఈ సాంకేతికత ద్వారా మేము కేవలం హృద్రోగాలను చికిత్స చేయడమే కాకుండా ఆంధ్ర ప్రదేశ్‌లో హృద్రోగ చికిత్స విధానాన్ని సమూలంగా మార్చుతు న్నామని డాక్టర్ నాగ శ్రీహరిత తెలిపారు. ఈ ముందడుగు, ఆంధ్రప్రదేశ్ ప్రజలకు ప్రపంచ స్థాయి, సాంకేతికత ఆధారిత ఆరోగ్య సంరక్షణ సేవలను చేరువ చేయడంపై కిమ్స్ శిఖర హాస్పిటల్ దృఢ సంకల్పాన్ని పునరుద్ఘాటిస్తోందన్నారు.

హెచ్ఐవి కేంద్రంలో సౌకర్యాలు నిల్..!



- గాలి వెలుతురు లేని చికిత్స కేంద్రం
- వైద్యం కోసం వచ్చిన చిన్నారులు టిబి బారిన పడే ప్రమాదం
- రోగులకు మరుగుదొడ్లు లేని దుస్థితి
- వర్షం వస్తే కేంద్రంలోకి డ్రెయినేజి
- కనీస సౌకర్యాలు కల్పించాలని రోగుల వేడుకోలు

రోగులు కూర్చునే చోట సీలింగ్ కూలిపోయిన దృశ్యం, వర్షానికి లోపల ఖాళీ లేకపోవడంతో బయట నుంచున్న రోగులు

ప్రజాశక్తి - పెదకాకాని

కోవిడ్ మహమ్మారిని మన అందరం చూశాం దాని తీవ్రత పరిణామాలు ప్రపంచాన్ని కుదిపేశాయి. ప్రభుత్వాలు ప్రజలు కలిసి దానిపై యుద్ధం చేసి అమరులైన వారు కొందరైతే జీవిస్తున్న మనమందరం విజేతలమే కోవిడ్‌ను కట్టడి చేయగలిగిన మనం క్షయ వ్యాధిని నిరోధించ లేకపోతున్నాం.దగ్గు తుమ్మటం మరియు ఉమ్మి వేయటం ద్వారా మైక్రో బ్యాక్టీరియా గాలిలో కలిసి రోగ నిరోధక శక్తి తక్కువ ఉన్నవారికి ఈ వ్యాధి సోకుతుంది.అయితే గుంటూరు సర్వజన ఆస్పత్రిలో హెచ్ఐవి మందుల పంపిణీ మరియు చికిత్స కేంద్రంలో (ఏ ఆర్ టి సెంటర్) టి బి వ్యాప్తికి కేంద్రంగా మారబోతుంది.ఈ కేంద్రంలో సుమారు 8000 మందికి పైగా చికిత్స తీసుకునేవారు ఉన్నారు.వీరిలో 50 నుండి 100 మంది చిన్నారులు చికిత్స పొందుతున్నారు.తమ తల్లిదండ్రుల నుండి హెచ్ఐవి బారిన పడిన చిన్నారులు నేడు క్షయ వ్యాధి కోరల బారిన పడటానికి అనువుగా ఉన్నారు. స్వతహాగా రోగ నిరోధక శక్తి తక్కువగా ఉండే హెచ్ఐవి వ్యాధిగ్రస్తులు చికిత్స కోసం వచ్చి మరో మహమ్మారి బారిన పడే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. ప్రస్తుతం ప్రభుత్వ ఆసుపత్రిలో ఉన్న ఏఆర్ టి కేంద్రంలో రోగులకు కనీస సౌకర్యాలు లేవు. గాలి వెలుతురు లేక రోగులు ఇబ్బంది పడుతున్నారు.కనీసం వారికి మరుగుదొడ్లు లేని దయనీయ స్థితి, వర్షం వస్తే వారు కూర్చున్న పక్కనుండే డ్రైనేజీ పారే దుస్థితి నెలకొంది అంటే వారి బాధ హఅదయ విదారకం.వారు మందుల కోసం వేచి ఉండే గదిలో సీలింగ్ కూలిపోయి ఇనుప రేకుల ఉక్కపోతలో చెమటకు తడుస్తూ వర్షం వస్తే ఆ నీటికి తడుస్తూ చెప్పుకోలేని చిత్రవధ అనుభవిస్తున్నారు. వ్యాధి నిరోధక శక్తి తక్కువ ఉండే వీరికి వర్షాకాలంలో అంటువ్యాధులు బారిన పడే అవకాశం చాలా ఎక్కువ ఉంది వైద్య ఆరోగ్యశాఖ అధికారులు ఇప్పటికైనా స్పందించి వారి పట్ల మానవతా దఅక్పథంతో ఆలోచించి వారికి కనీస సౌకర్యాలు కల్పిస్తూ ఏ ఆర్ టి సెంటర్ ను ప్రభుత్వ ఆసుపత్రిలో మరి ఒక చోటకి మార్చాలని వారికి కనీస సౌకర్యాలు కల్పించాలని కోరుకున్నారు.

మత్స్యకారులకు ఉపాధికి చర్యలు

గంబూషియాతో దోమల నివారణ - 19.70 లక్షల చేపపిల్లల ఉత్పత్తి

'ప్రజాశక్తి'తో జిల్లా మత్స్యశాఖ అధికారి బి.సైదా

జిల్లాలో మృత్యకారులకు ఉపాధి కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నట్టు మత్స్యాశాఖ జిల్లా అధికారి బి. సైదా తెలిపారు. జిల్లాలోని కాల్వలు, నీరు అధికంగా ఉండే ప్రదేశాల్లో దోమల నివారణకు లార్వా చనిపోవడానికి గంబోషియా చేపలను వినియోగిస్తున్నట్టు ఆయన తెలిపారు. ప్రజాశక్తి ప్రతినిధికి ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన పలు అంశాలు తెలియజేశారు.

మృత్యకారులకు ఉపాధికి చర్యలు?

చేపల పట్టే వృత్తిలో ఉన్న మత్స్యకారుల్లో ఎస్‌సి,ఎస్‌టి, బిసిలతో పాటు కొన్ని ప్రాంతాల్లో ఓసిలు కూడా ఉన్నారు. చెరువులు, నదులు, కాల్వల్లో చేపలు పట్టే వారికి ఉపాధి అవకాశాలు పెంపొందించేందుకు వీలుగా జిల్లాలో 22 మత్స్య కార సహకార సంఘాల ద్వారా 2260మందికి ఉపాధి లభిస్తోంది. వీరిలో పురుషులకు 16 సంఘాలు, స్త్రీలకు 6మ సంఘాలు ఉన్నాయి. పురుషులు మొత్తం 1721, స్త్రీలు 547 మంది ఉన్నారు. సముద్రంలో చేపల వేటకు వెళ్లే వారు కాకుండా మైదాన ప్రాంతాల్లో వీరు చేపల పెంపకం, చేపలను పట్టడం,విక్రయంలో కీలక పాత్ర పోషిస్తారు. కృష్ణానదీ పరివాహక ప్రాంతంలో మొత్తం 470 మందికి లైసెన్సులు ఉన్నాయి. ప్రభుత్వ అధీనంలోనే 100 ఎకరాలకు పైన ఉన్న చెరువులు నాలుగు ఉన్నాయి.

జిల్లాలో రొయ్యల చెరువులు ఎన్ని ఉన్నాయి?

జిల్లాలో 7 మండలాల పరిధిలోని 16 గ్రామాల్లో 195 ఎకరాల్లో రొయ్యల చెరువులు ఉన్నాయి. తెనాలి రూరల్‌లో 57.31 ఎకరాలు, చేబ్రోలు మండలంలో 70.03 ఎకరాలు, కాకుమానులో 10.74 ఎకరాలు, వట్టిచెరకూరు లో 21.77, తుళ్లూరులో రెండు ఎకరాలు రొయ్యల సాగు జరుగుతోంది.

గంబూషియా చేపల వినియోగం?

జిల్లాలో దోమల నివారణకు కూడా తమ శాఖ చర్యలు చేపడుతోంది. దోమల ఉధృతిని, పునర్ ఉత్పత్తిని తగ్గించేందుకు లార్వా దశలోనే నివారించేందుకు గంబూషియా చేపలను నీటి కుంటలు, చెరువుల, ఖాళీ స్థలాల్లోని నీరు నిల్వ ఉండే ప్రదేశాల్లో వదిలుతున్నాం. తద్వారా మలేరియా నివారణకు చర్యలు తీసుకుంటున్నాం.

చేప పిల్లల ఉత్పత్తికి తీసుకుంటున్న చర్యలు?

నిడుబ్రోలులోని ప్రభుత్వ చేపపిల్లల పెంపకపు ఉత్పత్తి కేంద్రం నుంచి 13.50 లక్షల చేప పిల్లలను, ప్రయివేటు కేంద్రాల నుంచి 6.20 లక్షలు, మొత్తం 19.70 లక్షల చేపపిల్లలను స్వదేశీ మత్స్యశాఖల జీవనోపాధికి పిఎంఎంఎస్‌వై పథకం కింద ప్రకాశం బ్యారేజి వద్ద కృష్ణానదిలో విడుదల చేశాం. ఈ ఏడాది మత్సకార భరోసా ఎంత మందికి ఇచ్చారు?

జిల్లాలో మత్సకారులకు వేట నిషేధ సమయంలో సముద్రంలో చేపలు పట్టే వారికి మాత్రమే ఈ పథకం వర్తిస్తుంది. బాపట్ల జిల్లాలో ఇందుకు సంబంధించి అన్ని తరగతుల వారు ఉంటారు. జిల్లాలో ఈఏడాది 12,691 మంది ఈ పథకానికి ఎంపిక అయ్యారు.

ప్రజాశక్తి - గుంటూరు జిల్లా ప్రతినిధి

మరో స్వాతంత్ర్య పోరాటానికి సిద్ధంకండి

సిఐటియు రాష్ట్ర కమిటీ సభ్యులు వై.నేతాజీ

ప్రజాశక్తి - తాడేపల్లి

కార్మికవర్గం పోరాడి సాధించుకున్న కార్మిక చట్టాలను, హక్కులను పరిరక్షించు కోవడానికి కార్మిక వర్గం మరో స్వాతంత్ర పోరాటానికి సిద్ధంగా కావాలని సిఐటియు రాష్ట్ర నాయకులు వై.నేతాజీ పిలుపు నిచ్చారు. ఆదివారం తాడేపల్లిలో సిఐటియు, వైఎస్ఆర్టియు, ఐ ఎన్ టి యు సి, ఏఐఎఫ్‌టియు, ఐ ఎఫ్ టి యు కార్మిక సంఘాల ఆధ్వర్యంలో సిఐటియు నాయకులు బూరుగ వెంకటేశ్వర్లు అధ్యక్షతన రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. కేంద్రంలోని మోడీ ప్రభుత్వం నాలుగు లేబర్ కోడ్లను తీసుకొచ్చి కార్మిక చట్టాలను నీరుగారిస్తుందని విమర్శించారు. ఔట్సోర్సింగ్ కార్మికుల అందరికీ కనీస వేతనాలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. జులై 9వ తేదీ జరగబోయే సార్వత్రిక సమ్మెలో తాడేపల్లి మండలంలోని కార్మిక వర్గం పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. పెద్ద ఎత్తున కార్మిక వర్గం యొక్క శ్రమను కార్పొరేట్ శక్తులకు దారా దత్తం చేయడం కోసం కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ప్రయత్నిస్తున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ విధానాలకు వ్యతిరేకంగా యావత్ భారత కార్మిక వర్గం సమాయత్తం కావలసిన పరిస్థితి ఆసన్నమైందని చెప్పారు. అందుకని కేంద్ర కార్మిక సంఘాల పిలుపు మేరకు జులై 9 జరగబోయే సమ్మెకు మండలంలోని అన్ని పరిశ్రమల కార్మికులని సమ్మెలో పాల్గొనే విధంగా చూడాలని కోరారు. సిఐటియు తాడేపల్లి పట్టణ కార్యదర్శి వేముల దుర్గారావు మాట్లాడుతూ సమ్మెను జయప్రదం చేయటం కోసం జులై ఏడవ తేదీన బైకు ర్యాలీ చేయాలని, 9వ తేదీన భారీ ఎత్తున కార్మిక వర్గ ర్యాలీ నిర్వహిస్తున్నట్లు చెప్పారు. సమ్మెలో తాడేపల్లిలోని అన్ని కంపెనీలను కార్మికులను సమ్మెలోకి తీసుకురావాలని ఆయన అన్నారు. ఈ రౌండ్ టేబుల్ సమావేశంలో ఐఎన్‌టియుసి నాయకులు ఏఐటీయూసీ నాయకులు కె.వెంకటయ్య, దర్శనపు శామ్యూల్, ఎసిసి యూనియన్ నాయకులు కూరపాటి స్టీవెన్, వైయస్సార్‌టియు నాయకులు శ్రీనివాస రాజు, ఏఐఎఫ్‌టియు నాయకులు కె.కోటయ్య, బి.సూర్యప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న సిఐటియు రాష్ట్ర కమిటీ సభ్యులు వై.నేతాజీ